E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 03-02-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక: 33|| పేజీలు–6 www.ekaburu.com



మహిళలకు 40 గ్రా... పురుషులకు 20 గ్రా.

» 4లో

# వాణిజ్య ఒప్పందానికి ఓకే

» భారత్‌పై సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నాం
» మా వస్తువులపై సున్నా సుంకాలకు, రష్యా చమురు నిలిపివేతకు ఆ దేశం అంగీకరించింది
» మోదీ నాకు గొప్ప స్నేహితుడు
» ప్రధానితో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన
» 25 శాతం అదనపు సుంకాలూ ఉండబోవన్న శ్వేతసౌధం
» ట్రంప్‌నకు 140 కోట్ల మంది తరఫున కృతజ్ఞతలు.. సుంకాల తగ్గింపుపై మోదీ
» వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావించని ప్రధాని




ఈ కబురు, దిల్లీ: భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం (ఇందులో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతం అదనపు సుంకం ఉంది) సుంకాలు 18 శాతానికి తగ్గుతాయి.
శ్వేతసౌధం కూడా ఈ అదనపు సుంకాల తొలగింపును ధ్రువీకరించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సోమవారం ట్రంప్ ఫోన్ చేశారు. అనంతరం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో ప్రకటన చేశారు. "ప్రధాని మోదీతో మాట్లాడటాన్ని గౌరవంగా భావిస్తున్నా. నాకున్న గొప్ప స్నేహితుల్లో ఆయన ఒకరు. భారత్‌కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం.

తరువాయి 2లో

## నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా?




» అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు విచారణ తప్పదు
» కేసీఆర్ కుటుంబానికి రూ. వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?
» 60 ఏళ్లకు రాజకీయ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి
» ప్రజలు తిరస్కరించినా నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవట్లేదు: సీఎం రేవంత్‌రెడ్డి
» జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి రావి నారాయణరెడ్డి జాతీయ అవార్డు ప్రదానం

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబమే అనుభవించిందని.. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల రూపాయల ఆస్తులు వారికి ఎక్కడి నుంచి వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా అని అన్నారు. అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో 'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో రావి నారాయణరెడ్డి జాతీయ అవార్డు 2025 ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి అవార్డు అందజేశారు. అనంతరం నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు సీఎంను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 'నేను రాష్ట్రంలో లేకపోయినా ఇక్కడ జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తూనే ఉంటా.

తరువాయి 2లో

మెరుపుల కప్పు.. వచ్చేస్తోంది

..టీ20 ప్రపంచకప్ మరో 4 రోజుల్లో




» 6లో

## తిరుమలలో వైకాపా చేసింది ముమ్మాటికీ మహాపచారమే

» కాసుల కక్కుర్తితో నెయ్యికాని నెయ్యితో లడ్డూ తయారీ.. సిట్ తేల్చి చెప్పింది ఇదే
» భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదనే. . జంతు కొవ్వు కలిసిందో లేదో బహిర్గతం చేయలేదు
» వైకాపా నాయకులు గోబెల్స్ ప్రచారం..
» అబద్ధాలు, బుకాయింపులతో తప్పించుకునే యత్నం
» ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం
» ప్రజలకు తెలియజెప్పాలంటూ శ్రేణులకు ఉద్బోధ
» వైకాపా నేతల భాష సరిగా లేనందునే వారిపై దాడులు
» దాడులను ఏ పార్టీ సమర్థించదని వ్యాఖ్య



ఈ కబురు , అమరావతి: 'వైకాపా పాలనలో తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదని సిట్ తేల్చింది. రసాయనాలు, పామాయిల్ ఉపయోగించి తయారు చేసిన నూనెతో లడ్డూలు తయారు చేసి శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. కోట్లమంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని.. జంతువుల కొవ్వు కలిసిందా లేదా అనే విషయాన్ని సిట్ బహిర్గతం చేయలేదు. లడ్డూ విషయంలో వైకాపా నేతలు చేస్తున్న గోబెల్స్ ప్రచారం ఆగాలంటే వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలి' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం జనసేన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, వీర మహిళ ప్రాంతీయ సమన్వయకర్తలు, అధికార ప్రతినిధులు, వివిధ విభాగాల ఛైర్మన్లు పాల్గొన్నారు.

తరువాయి 2లో

## ఫోన్ ట్యాపింగ్.. కల్పిత కథ

» అక్రమ విచారణలతో దృష్టి మళ్లింపు రాజకీయాలు
» ఏపీ జలదోపిడీకి సీఎం సహకారం
» మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్



ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు మేలు చేకూర్చే పనులేవీ చేయలేదని, అన్ని రంగాల్లోనూ విఫలమైందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధపు ప్రచారాలు, అక్రమ విచారణలతో దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక అయిన కేసీఆర్‌ను విచారణ పేరిట గంటల తరబడి కూర్చోబెట్టడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ధ్వజమెత్తారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటివరకు ఏ వ్యాపారవేత్తగానీ, ఏ నటిగానీ ఫిర్యాదు ఇవ్వలేదు. ఇదంతా ఒక కల్పిత కథ. 'బ్లాక్‌మెయిల్' అంటూ భారాస మీద ఆరోపణలు చేసేముందు పీసీసీ అధ్యక్షుడు ఒకసారి పునరాలోచించుకోవాలి. భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇకనైనా వైఖరి మార్చుకోవాలి' అని సూచించారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసంలో కేటీఆర్ సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

తరువాయి2లో

చిరు రికార్డుల వెనుక చరణ్, సుస్మిత.. '..వరప్రసాద్‌గారు'కు ముందు ఇన్ని జరిగాయా



» 5లో

దలైలామాకు గ్రామీ అవార్డు 2లో





### బట్టబయలు అవుతుందనే మాట్లాడనివ్వలేదు: రాహుల్

ఈ కబురు, దిల్లీ: సభ వాయిదా పడిన తర్వాత రాహుల్ విలేకరులతో మాట్లాడారు. దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని సభలో లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించడం లేదని ఆరోపించారు. 2లో

### నరవణె పుస్తకంపై వాగ్వాదం



ఈ కబురు, దిల్లీ:
దిల్లీ: భారత్-చైనా మధ్య 2020లో జరిగిన ఘర్షణ అంశం సోమవారం లోక్‌సభను స్తంభింపజేసింది. 2లో

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్



» రాష్ట్రానికి రూ. 5,454 కోట్ల కేటాయింపులు
» 'హైస్పీడ్' ప్రాజెక్టులు తెలంగాణకు గేమ్ ఛేంజర్
» రెండు గంటల్లోనే బెంగళూరుకు..
» రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

ఈ కబురు, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రైల్వేశాఖకు సంబంధించి తెలంగాణకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారనుందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలవారీగా చేసిన కేటాయింపుల వివరాల్ని దిల్లీలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వేశాఖ మంత్రి వెల్లడించారు.

తరువాయి2లో

## కేసీఆర్‌పై అక్కసును మరోసారి బయటపెట్టిన సీఎం

» హరీశ్‌రావు విమర్శ



ఈ-కబురు, హైదరాబాద్: హేట్ స్పీచ్‌పై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హితబోధ చేసిన కొద్ది నిమిషాల్లోనే అదే వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి తన మాటల ద్వారా కేసీఆర్‌పై అక్కసును మరోసారి బయటపెట్టారని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై 'ఎక్స్' వేదికగా సోమవారం ఆయన స్పందించారు.

తరువాయి3లో

## దిల్లీకి చేరిన బెంగాల్ 'సర్' పోరాటం

సీఈసీతో భేటీ నుంచి మమతా బెనర్జీ వాకౌట్



దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చేస్తోన్న పోరాటం దిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) అపాయింట్‌మెంట్ తీసుకుని దిల్లీ వచ్చిన బెంగాల్ సీఎం, టీఎంసీ అగ్రనేత మమతా బెనర్జీ ఈసీతో, దిల్లీ పోలీసులతో ఘర్షణకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో సోమవారం సాయంత్రం భేటీ అయిన మమత ఆ సమావేశం నుంచి అర్ధంతరంగా వాకౌట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జ్ఞానేశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

తరువాయి3లో




# నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా?

ఈ మధ్య కొంత మంది తామే తెలంగాణ జాతిపిత అని అనుకుంటున్నారు. ఉద్యమకారులమని వారికి వారే రాసుకుంటున్నారు. చేసిన తప్పులకు పోలీసులు నోటీసులు ఇస్తే.. జాతిపితకు నోటీసులు ఇవ్వడం అంటే మొత్తం తెలంగాణ సమాజానికే ఇచ్చినట్టు అంటున్నారు. ఆనాటి జాతిపిత దేనికి ఆదర్శంగా నిలబడ్డారు? ఏదైనా పదవి తీసుకున్నారా? స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదిలోపే తుపాకీ తూటాలకు నేలకొరిగారు. ఉద్యమ సమయంలో సర్వం కోల్పోయిన వారు తెలంగాణలో ఎంతో మంది ఉన్నారు. కానీ కేసీఆర్ కుటుంబం వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, రూ.వేల కోట్లు సంపాదించింది. చేయాల్సిన తప్పులన్నీ చేసిన మీరెలా జాతిపిత అవుతారు..? ప్రజలు తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలి. ఆ ఓటమిని ప్రజలపైనే నెట్టడం ఎంత వరకు సబబు. ఉద్యమకారులు అని చెప్పుకొనే వారికి.. అన్ని పార్టీలను ఏకం చేసి రాజకీయ ఐకాస ఏర్పాటు చేసిన ప్రొ.కోదండరాం ఉద్యమకారుడిగా కనిపించడం లేదా..? ఆనాడు కోదండరాంను ఎలా అవమానించారు. ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్టు చేశారు. మేం ఆదివారం ఎవరినీ అరెస్టు చేయలేదే..? ఎవరి తలుపులు బద్దలు కొట్టలేదే..? కోదండరాంను పెద్దల సభకు తీసుకురావడం వాళ్లకు ఇష్టం లేదు. అందుకే సుప్రీంకోర్టు వరకు వెళ్లి అడ్డుకున్నారు.

--'సర్'తో ఓటు హక్కు కాలరాసే కుట్ర

నాణేనికి రెండు వైపులా అన్నట్టు ప్రజాక్షేత్రంలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ పనిచేస్తున్నాయి. కమ్యూనిస్టు సోదరుల పోరాటాలకు అనుగుణంగా పేదల కోసం కాంగ్రెస్ కనీసవేతన, కనీస మద్దతు ధర, ఆదివాసీ అటవీ హక్కుల చట్టాలు చేసింది. ప్రధాని మోదీలాంటి వారు 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అంటున్నారు. కానీ వన్ పర్సన్ వన్ పార్టీ విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. పూర్తిగా రాజ్యాంగాన్నే తొలగించాలనే ఆలోచనతో గత లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు కావాలని అడిగారు. కానీ ప్రజలు తెలివిగా ఆ పార్టీని నియంత్రించారు. ప్రస్తుతం ఓటు హక్కును కాలరాసే కుట్ర 'ఎస్ఐఆర్'తో జరుగుతోంది. నిరక్షరాస్యుల ఓటు హక్కును కాలరాయాలనుకుంటున్నవారు రేపు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా అందిస్తారు. ఇది ముమ్మాటికీ రాజ్యాంగంపై దాడి చేయడమే.

--రావి నారాయణరెడ్డి విగ్రహ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం..

క్రియాశీల రాజకీయాల్లో ఉన్నవారికి రావి నారాయణరెడ్డి ఆలోచనలు స్ఫూర్తినిస్తున్నాయి. అరాచక చర్యలను వ్యతిరేకిస్తూ నిజాంకు ఎదురొడ్డి సాయుధ పోరాటం చేశారు. 500 ఎకరాలను పేదలకు పంచి స్ఫూర్తిగా నిలిచారు. వారి విగ్రహ ఏర్పాటుపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఆయన సూచించిన మార్గాన్ని అనుసరిస్తూ, స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ ఈ అవార్డును సముచితమైన సమయంలో సముచితమైన వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి అందించారు. 60 ఏళ్ల వయస్సు వచ్చేనాటికి రాజకీయ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావినారాయణరెడ్డి. కానీ నేటి నేతలకు ప్రజలు తిరస్కరించినా పదవీ వ్యామోహం పోవట్లేదు' అని సీఎం విమర్శించారు.

--ఆలోచింపజేసిన 'తెలంగాణ నగ్నసత్యం'..

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ''న్యాయమూర్తిగా, ప్రధాన న్యాయమూర్తిగా, సర్వోన్నత న్యాయమూర్తిగా ఉన్న సమయంలో వచ్చిన అవార్డులు ఒక ఎత్తయితే రావి నారాయణరెడ్డి స్మారక అవార్డు పొందడం గొప్పదిగా భావిస్తున్నాను. రావి నారాయణరెడ్డి యుగపురుషుడు, నిత్య చైతన్యస్ఫూర్తి ఉన్న నాయకుడు, విప్లవవీరుడు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆస్తిపాస్తులు, జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి. తెలంగాణ స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం. ఆయన రూపొందించిన డాక్యుమెంటరీ 'తెలంగాణ నగ్నసత్యం'లో అనేక విషయాలు చర్చించారు. ప్రశ్నలు లేవనెత్తారు.. సాయుధ పోరాటం, నాయకత్వంలో ఉన్నవారి బాధ్యతలేమిటి అనే అంశాలను వివరించారు. సాయుధపోరాటం విరమించే సందర్భంలో ఎదురైన అనుభవాలు, అప్పటి నాయకులు తీసుకున్న నిర్ణయాలు ఆలోచింపజేశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ చరిత్ర గురించి చెప్పాల్సి ఉంది. ఇందుకు 'తెలంగాణ నగ్నసత్యం' డాక్యుమెంటరీపై పరిశోధన జరపాలి. ఏ యూనివర్సిటీలో అయినా ఈ అంశాన్ని పొందుపరచాలి. భావప్రకటనా స్వేచ్ఛ అంశంలో చేసిన రాజ్యాంగ సవరణలతో కామ్రేడ్లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉంది'' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ నేత నారాయణ, రావి ప్రతిభ, రత్నాకర్‌రావు, పల్లా వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, అద్దంకి దయాకర్, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు అధ్యక్షుడు చాడ వెంకట్‌రెడ్డి, కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బట్టబయలు అవుతుందనే మాట్లాడనివ్వలేదు: రాహుల్



**నరవణె పుస్తకం ప్రచురితమైతే.. మన సైన్యాన్ని ప్రభుత్వ నేతలు ఎలా నిరాశపరిచారనే విషయాలను ప్రజలు తెలుసుకుంటారని చెప్పారు. డోక్లాం అంశంలో మోదీ, రాజ్‌నాథ్ సింగ్‌లతో నరవణె ఏం మాట్లాడారో రెండుమూడు వాక్యాలు చెప్పేందుకు యత్నించానని, అంతా బట్టబయలు అవుతుందనే భయంతోనే తనను మాట్లాడనీయకుండా చేస్తున్నారని మండిపడ్డారు.**

## నరవణె పుస్తకంపై వాగ్వాదం



**దిల్లీ: భారత్-చైనా మధ్య 2020లో జరిగిన ఘర్షణ అంశం సోమవారం లోక్‌సభను స్తంభింపజేసింది. చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన ఆత్మకథలోని అంశాలను విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రస్తావించడంపై అధికారపక్షం భగ్గుమంది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో భాజపా ఎంపీలు ఆక్షేపణ తెలిపారు. సభను రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నారని విరుచుకుపడ్డారు. రాహుల్ మాట్లాడేందుకు స్పీకర్ ఓంబిర్లా అనుమతించలేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సమయంలో వాగ్వాదం, గందరగోళం తలెత్తింది. ఈ తీర్మానంపై మాట్లాడేముందు భాజపా సభ్యుడు తేజస్వీ సూర్య.. కాంగ్రెస్ పార్టీ జాతీయవాదంపై చేసిన అభియోగాలపై స్పందిస్తానని రాహుల్ చెప్పారు. 2020లో లద్దాఖ్ ఘర్షణలపై నరవణె రాసిన పుస్తకానికి సంబంధించి ఒక మ్యాగజీన్ ప్రచురించిన కథనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడుతోందని ఆరోపించారు. ఇవి తాను చెప్పే మాటలు కాదని, స్వయంగా నరవణె ఓ పుస్తకంలో రాశారని రాహుల్ చెప్పారు. ఈ పుస్తకం ప్రచురణను కేంద్రం అడ్డుకుంటోందన్నారు.**

**ప్రచురితమైందా.. స్పష్టతనివ్వండి**

**రాహుల్ చెబుతున్న పుస్తకమే ఇంకా ప్రచురితం కాలేదని, దానిపై ఎలా మాట్లాడతారని రాజ్‌నాథ్‌తో పాటు కేంద్రమంత్రి అమిత్ షా అభ్యంతరం వ్యక్తంచేశారు. పుస్తకం ప్రచురితమైందో లేదో ముందుగా స్పష్టతనివ్వాలన్నారు. సభా కార్యకలాపాలతో సంబంధంలేని అంశాలపై పుస్తకాలను, పత్రికా వార్తలను ప్రస్తావించడానికి వీల్లేదని స్పీకర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. తాను లేవనెత్తుతున్నది ప్రామాణిక విషయమేనని రాహుల్ సమర్థించుకున్నారు. దానికి స్పీకర్ అనుమతించలేదు. వాగ్వాదాలతో సభ మంగళవారానికి వాయిదాపడింది. ధన్యవాద తీర్మానంపై తానేం మాట్లాడాలో కూడా చెప్పాలని**

# వాణిజ్య ఒప్పందానికి ఓకే



వాణిజ్యం, రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకగలదని అనుకుంటున్నా. మోదీపై గౌరవంతో ఆయన విజ్ఞప్తిమేరకు వెంటనే వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నా. అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత ప్రధాని కట్టుబడి ఉన్నారు. 500 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లకు అదనంగా మరిన్ని దిగుమతులకు ఆ దేశం సిద్ధంగా ఉంది. వారితో మాకున్న అద్భుతమైన బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ముందుకు సాగనుంది. మోదీ, నేను అన్ని విషయాలను చక్కబెడుతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై మోదీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున అధ్యక్షుడు ట్రంప్‌నకు చాలా చాలా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అయితే ఆయన వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించలేదు. 'ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, సుసంపన్నతకు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుంది. రెండు దేశాల భాగస్వామ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేసేందుకు ఎదురు చూస్తున్నా' అని మోదీ వివరించారు. మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్‌లో తెలిపారు. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జైశంకర్ మూడు రోజుల అమెరికా పర్యటన ప్రారంభమైన నేపథ్యంలో ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్



ద.మ.రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్‌నిలయం నుంచి.. ఇతర జోన్ల జీఎంలు ఆయా కార్యాలయాల నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపిన మంత్రి.. ''నమస్తే.. తెలంగాణ.. ఎలా ఉన్నారు..'' అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మంత్రి వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

తెలంగాణకు మూడు కొత్త బుల్లెట్ రైలు ప్రాజెక్టులు మంజూరయ్యాయి. అవి.. హైదరాబాద్‌చెన్నై, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణె. ఈ ప్రాజెక్టులతో హైదరాబాద్ దేశంలో ప్రధాన బుల్లెట్ రైళ్లకు మేజర్ హబ్‌గా మారనుంది. తెలంగాణలో ప్రస్తుతం చేపట్టిన రైల్వే ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.47,984 కోట్లు. గతంలో కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన బడ్జెట్‌తో పోలిస్తే ఈ మొత్తం దాదాపు ఆరు రెట్లు ఎక్కువ. బుల్లెట్ రైలు ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాక ప్రయాణ సమయాలు పూర్తిగా మారిపోతాయి. హైదరాబాద్ నుంచి పుణెకు దాదాపు 1.55 గంటల్లో.. ముంబయికి 2.45 గంటల్లో.. చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో.. బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు. ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులు తెలంగాణకు గేమ్ ఛేంజర్‌గా మారనున్నాయి.

--'ఎలివేటెడ్' మార్గాలే..

అన్ని హైస్పీడ్ కారిడార్లు ఎత్తైన మార్గాలపైనే (ఎలివేటెడ్) నిర్మాణం అవుతాయి. దీనివల్ల ఆయా మార్గాల్లోని గ్రామాలు, పట్టణాల భౌగోళిక స్వరూపానికి నష్టం ఉండదు. భూసేకరణను కూడా ఈ విధానం తగ్గిస్తుంది. హైస్పీడ్ కారిడార్‌ల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. డీపీఆర్‌లు, ఎలైన్‌మెంట్లు, డిజైన్లు తుదిదశలో ఉన్నాయి.

దేశంలో తొలి హైస్పీడ్ కారిడార్ (ముంబయిఅహ్మదాబాద్) ప్రాజెక్టు ద్వారా మా ఇంజినీర్లు, తయారీదారులు, నిర్మాణ బృందాలు, డిజైన్ నిపుణులు, జియో టెక్నికల్, ఎలక్ట్రికల్ వ్యవస్థల నిపుణులు క్లిష్టమైన సాంకేతికతపై విలువైన అనుభవాన్ని సంపాదించారు. దీన్ని ఆధారంగా చేసుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇప్పుడు మేము రెండోదశ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల్లోకి ప్రవేశించాం. దేశవ్యాప్తంగా ఉత్తర, తూర్పు, దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో మొత్తం 7 కొత్త బుల్లెట్ రైలు ప్రాజెక్టులు చేపడతాం. ఈ హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి.

--వచ్చే ఏడాది మార్చి కల్లా సికింద్రాబాద్ స్టేషన్ పనులు పూర్తి: జీఎం

ప్రస్తుతం విమానాల ద్వారానే దూరప్రాంతాలకు తక్కువ సమయంలో ప్రయాణించే వెసులుబాటు ఉందని.. ఇక హైస్పీడ్ కారిడార్లలో బుల్లెట్ రైళ్ల ద్వారా కూడా ఇతర రాష్ట్రాలకు వేగవంతంగా ప్రయాణం చేయవచ్చని ద.మ.రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. రైల్వేమంత్రి విలేకరుల సమావేశం అనంతరం జీఎం రైల్‌నిలయంలో మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు 50 శాతం పూర్తయ్యాయని.. 2027 మార్చినాటికి పనులన్నింటినీ పూర్తిచేస్తామని వెల్లడించారు.

# తిరుమలలో వైకాపా చేసింది ముమ్మాటికీ మహాపచారమే



పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ ఏం మాట్లాడారంటే.. 'కాసులకు కక్కుర్తి పడి వైకాపా నాయకులు తిరుమలలో అపచారం చేశారు. నిబంధనల్ని అడ్డగోలుగా మార్చేసి టన్నుల కొద్దీ కల్తీ నెయ్యి కొని తెచ్చి ప్రసాదాల్లో కలిపేశారు. రూ.400కి కిలో నాణ్యమైన నువ్వుల నూనె కూడా దొరకదు. అలాంటిది నెయ్యి ఎక్కడ దొరుకుతుంది? అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సిందంతా చేసి ఇప్పుడు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. అబద్ధాలు, బుకాయింపులతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వైకాపా అపరాధాలను మనం ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి' అని అన్నారు. 'వైకాపా నాయకులతో వ్యక్తిగత ద్వేషం, వైరం లేదు. వాళ్ల భాష, నేర స్వభావంతోనే సమస్య. ఇళ్లల్లోకి వస్తాం, దాడులు చేస్తాం, నరికేస్తాం అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారు. వాళ్ల భాష సరిగా లేని కారణంగానే ఈరోజు దాడులు జరుగుతున్నాయి. దాడులను, హింసను ఏ రాజకీయ పార్టీ సమర్థించదు. సీఎం చంద్రబాబు కూడా చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని చెబుతున్నారు. వైకాపా నాయకులు ప్రజల్లో భయం సృష్టిస్తున్నారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే.. అంటూ భయపెడుతున్నారు. గతంలో వాళ్ల ప్రవర్తన వల్ల 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. మరో 15 ఏళ్లు కూటమి అధికారానికి ఢోకా లేదు. ప్రజలు ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

--ఎన్నికలు నిర్వహించి పార్టీ పదవులు

'నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పదవులకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించాం. పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురం నియోజకవర్గంలో ఇలా చేశాం. అన్ని నియోజకవర్గాల్లో ఇదే ప్రక్రియ అమలు చేస్తాం. రాష్ట్రంలో జిల్లాలను జోన్లుగా విభజించుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలి. మార్చి 14న పార్టీ ఆవిర్భావ దినోత్సవం 'జెన్ జి డే' ఏర్పాట్లపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. సామాజిక మాధ్యమాలు గెలుపు ఓటముల్ని నిర్ణయించే ఆయుధం కాదు. అది గెలుపునకు ఒక కారణం మాత్రమే అవుతుంది. సామాజిక మాధ్యమాలే గెలుపును ప్రభావితం చేస్తే అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ గెలిచేవారే కాదు. ఆయనపై వచ్చినన్ని ట్రోలింగులు ఎవరిపైనా రాలేదు. మన పార్టీపై వచ్చిన వ్యతిరేక వార్తలను మనమే వైరల్ చేస్తున్నాం. దానివల్ల మరింత బలం చేకూరుతోంది. ఆ పద్ధతి మనం మార్చుకోవాలి' అని జనసేన అధ్యక్షులు చెప్పారు.

**---32 మందితో క్రమశిక్షణ కమిటీ**


పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 32 మందితో క్రమశిక్షణ కమిటీని నియమిస్తున్నాం. ప్రారంభంలో ఈ కమిటీకి నేనే అధ్యక్షుడిగా ఉంటాను. కమిటీలో ఉండే ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఈ కమిటీలో మూడోవంతు మారుస్తూ ఉంటాం. పార్టీ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం పెరగాలి. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం' అని పవన్ కల్యాణ్ అన్నారు.

# దలైలామాకు గ్రామీ అవార్డు

**మెడిటేషన్స్‌పై ప్రసంగ ఆల్బమ్‌కు దక్కిన గౌరవం**

**మండిపడిన చైనా**

ఈ కబురు నెట్ వర్క్ : ప్రముఖ బౌద్ధ గురువు దలైలామాకు గ్రామీ అవార్డు దక్కింది. 'మెడిటేషన్స్: ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిస్ హోలీనెస్ ద దలైలామా' పేరుతో ఆయన చేసిన ప్రసంగ ఆల్బమ్‌కు ఈ గౌరవం దక్కింది. 90 ఏళ్ల టిబెట్ ఆధ్యాత్మిక గురువు అయిన దలైలామాకు గోల్డెన్ గ్రామోఫోన్ దక్కడం ఇదే తొలిసారి. ఆదివారం రాత్రి లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టోడాట్‌కామ్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 90 కేటగిరీలో అవార్డులను ప్రకటించారు. దలైలామాకు అవార్డు దక్కడంతో హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. దలైలామా తరఫున గాయకుడు రఫూస్ వెయిన్‌రైట్ అవార్డును స్వీకరించారు. 'ఆడియో బుక్స్, నరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్' కేటగిరీలో ఈ అవార్డు దక్కింది. గాయకులు మ్యాగీ రోజర్స్, ఆండ్రా డేతో కలిసి దలైలామా ఈ ఆల్బమ్ రూపకల్పనలో పాలుపంచుకున్నారు. కబీర్ సెహగల్ నిర్మించిన ఈ ఆల్బమ్‌లో సరోద్ విద్వాంసుడు అంజాద్ అలీ ఖాన్, ఆయన కుమారులు అమాన్ అలీ బంగాష్, అయాన్ అలీ బంగాష్, అమెరికా శాక్సాఫోన్ విద్వాంసుడు టెడ్ నాష్, గాయకుడు, గేయ రచయిత డెబీ నోవా తదితరులు కనిపించారు. అవార్డును తాను వ్యక్తిగత ఘనతగా భావించడం లేదని, దానిని కృతజ్ఞతతో, మానవత్వంతో స్వీకరిస్తున్నానని, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న బాధ్యతలకు వచ్చిన గుర్తింపుగా భావిస్తున్నామని దలైలామా తెలిపారు. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తప్పుబట్టింది. తమ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆయనకు అవార్డు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది. మతం పేరుతో ఆయన విభజన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ వ్యాఖ్యానించారు. 'ఆయనో రాజకీయ శరణార్థి. మతం పేరుతో చైనాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు' అని పేర్కొన్నారు.



# ఫోన్ ట్యాపింగ్.. కల్పిత కథ



రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పెట్టుబడులు, దావోస్ సహా అన్ని ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అసెంబ్లీలో చర్చపెట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో భారాస ఘన విజయం సాధించబోతోందని పేర్కొన్నారు.

--తెలంగాణ ఉద్యమ రోజులు మళ్లీ గుర్తొచ్చాయి

''కేసీఆర్‌ను సిట్ విచారించిన సమయంలో.. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క రోజులోనే దాదాపు 7వేలకు పైగా గ్రామాల్లో భారాస శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. హైదరాబాద్ సహా అన్ని పట్టణాల్లో బైక్ ర్యాలీలు, ఆందోళనలు జరిగాయి. వీటిని చూస్తుంటే తెలంగాణ ఉద్యమ రోజులు మళ్లీ గుర్తొచ్చాయి. తెలంగాణ కుంభమేళాగా పిలుచుకునే మేడారం జాతర నిర్వహణలోనూ ప్రభుత్వం విఫలమైంది. ఒక మంత్రి కారు అద్దాలను ప్రజలు ఆగ్రహంతో పగలగొట్టే పరిస్థితి వచ్చిందంటే.. ఏస్థాయికి నిర్వహణ దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. దోపిడీలు, లూటీలు, హత్యలు పెరిగిపోయి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. జలవనరులు, భూములు, బొగ్గు గనులను కాపాడటంలోనూ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. తన పాతబాస్ చంద్రబాబుకు, కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి దాసోహమవుతున్నారు. బనకచర్ల, నల్లమలసాగర్ వంటి కీలక అంశాల్లో తెలంగాణ ప్రయోజనాలు శాశ్వతంగా దెబ్బతినేలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. సింగరేణి కుంభకోణాలపై సిటింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసినా.. ఈ ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదు? ఇందులో ముఖ్యమంత్రి బావమరిది భారీ అక్రమాలకు పాల్పడ్డారు కాబట్టే.. వాస్తవాలు బయటకు రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటోంది. దేశానికి లైఫ్ సైన్సెస్ రాజధాని హైదరాబాద్. ఇక్కడి బయో ఫార్మా రంగం అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం భాజపా ద్వంద్వ నీతికి నిదర్శనం. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ కోసం పదేళ్లుగా అడుగుతున్నా పది పైసలు కూడా ఇవ్వలేదు. తెలంగాణపై కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించకుండా రాజకీయ విమర్శలకు పరిమితం కావడం సరికాదు. ఫోన్‌ట్యాపింగ్ అంశంలో 'ఇల్లీగల్' అని సీపీ సజ్జనార్ వ్యాఖ్యానించడానికి ఆయన వద్ద ఏమైనా ఆధారాలున్నాయా? ఆయన ఎక్స్ ప్రకటనల ద్వారా జడ్జిమెంట్లు ఇవ్వడం హాస్యాస్పదం'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# చదువులమ్మ ఒడి... కలిపింది మరోసారి...

## మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆత్మీయ కలయిక










ఈకబురు, మోటకొండూరు : దశాబ్దాల జ్ఞాపకాల తలుపు తట్టిన వేళ... 36 ఏళ్ల తరువాత వారిని చదువులమ్మ ఒడి మరోసారి కలిపింది.. మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సందడిగా సాగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన 70 మంది విద్యార్థులు ఒకేచోట చేరి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పదవ తరగతి వరకు ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ వృత్తులు,హోదాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఈ కార్యక్రమానికి హాజరై తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు. అప్పట్లో తమకు గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చదువుకునే రోజుల్లో అలనాటి జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరికొకరు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు ప్రస్తుత విద్యార్థుల క్రీడా అవసరాల కోసం రూ. 10 వేల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమానికి పూర్వ ఉపాధ్యాయులు కొంతం అంజిరెడ్డి, పైళ్ళ కృష్ణారెడ్డి, బంద్రు రాజమల్లయ్య, అనంతుల బుచ్చిరెడ్డి, భాస్కరరావు, మధురవాణి హాజరయ్యారు. కార్యక్రమంలో దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి డివిజన్ లో రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కోట్ల నిధులు వెచ్చిస్తూ కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీలో 10 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో కలిసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నల్లగండ్ల హుడా కాలనీలోని మెయిన్ నాలా నుండి 7 ఎంఎల్డి సామర్థ్యం గల నల్లగండ్ల ఎస్టీపీ ప్లాంట్ వరకు 600 ఎంఎం, 500 ఎంఎం, 450 ఎంఎం, 300 ఎంఎం, 250 ఎంఎం, 200 ఎంఎం డయా ఆర్‌సీసీ సేవరేజ్ పైపుల మురుగునీటి తయారీ, సరఫరా, జాయింటింగ్, పరీక్షల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని డ్రెయినేజీ పైప్‌లైన్ డయా మీటర్‌ను పెంచుతూ, సరైన లెవల్స్‌తో అనుసంధానం చేస్తూ, ఒక కాలనీ నుండి మరో కాలనీకి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు ప్రణాళికబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలతో నిత్యం మమేకమై, బస్తీ వారీగా సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అనేక అభివృద్ధి పనులను విజయవంతంగా అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు. కాలనీల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. సమస్యలను ఒక్కొకటిగా పరిష్కరిస్తూ శాశ్వత పరిష్కారాల దిశగా అడుగులు వేస్తున్నామని, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఎం పద్మజ, జీఎం వస సత్యనారాయణ, డీజీఎం భార్గవి, స్వామి ప్రసాద్, జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి, మేనేజర్ అభిషేక్ రెడ్డితో పాటు అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి


స్థానికులతో సమావేశమైన గచ్చిబౌలి కార్పొరేటర్

# గచ్చిబౌలిలో ఘనంగా 'లైట్ ది నైట్' వేడుకలు

***ర్యాంప్ వాక్ తో మెరిసిన ప్రముఖ జంటలు***

*ఈ-కబురు, శేరిలింగంపల్లి : క్యాన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా క్యూర్ ఫౌండేషన్, అపోలో క్యాన్సర్ సెంటర్స్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ & కంట్రీ క్లబ్‌లో వరల్డ్ క్యాన్సర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'లైట్ ది నైట్' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో క్యూర్ ఫౌండేషన్ తన 23వ వార్షికోత్సవాన్ని సైతం జరుపుకుంది. ఈ వేడుకలో భాగంగా ప్రత్యేక ర్యాంప్ వాక్ నిర్వహించారు. క్యాన్సర్ బాధితులకు సంఘీభావం తెలుపుతూ పలు ప్రముఖ జంటలు, విశిష్ట వ్యక్తులు ఈ ర్యాంప్‌పై నడిచారు. ఈ వేడుకకు బాలీవుడ్ నటి క్యాన్సర్ విజేత మనీషా కొయిరాలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హైదరాబాద్ అపోలో క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పీ విజయ్ ఆనంద్ రెడ్డితో కలిసి ఆమె ర్యాంప్ వాక్ చేశారు. గోల్ఫ్ క్రీడాకారులు ప్రొఫెషనల్ మోడల్స్‌తో సాగిన ర్యాంప్ వాక్ ఆహూతులను ఉర్రూతలూగించింది.*


విజేతలకు క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్ షిప్ ట్రోఫీ అందజేస్తున్న విజయ్ ఆనంద్ రెడ్డి


ప్రముఖుల ర్యాంప్ వాక్


ప్రముఖుల ర్యాంప్ వాక్


ప్రముఖుల ర్యాంప్ వాక్

# ఢిల్లీకి చేరిన బెంగాల్ 'సర్' పోరాటం



అహంకారపూరితంగా వ్యవహరించారని, తమ ప్రతినిధులను అవమానించారని ఆరోపించారు. సర్ కసరత్తుతో పలువురు ప్రాణాలు కోల్పోయినా ఈసీ పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. భాజపా దళారిగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని ధ్వజమెత్తారు. ఇక ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు. మమతా బెనర్జీ ఆరోపణలను సీఈసీ తోసిపుచ్చారు. టీఎంసీ ప్రతినిధులకు సమాధానం చెబుతుండగానే మమత ఆగ్రహంతో భేటీ నుంచి వెళ్లిపోయారని తెలిపారు. అంతకుముందు ఢిల్లీలోని బంగ భవన్ వద్ద భారీ స్థాయిలో పోలీసుల మోహరింపుపై మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో వారితో ఘర్షణకూ దిగారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 'సర్' బాధితులు ఢిల్లీలోని బెంగాల్ ప్రభుత్వ భవనాల్లో బస చేశారు. చాణిక్యపురిలోని బంగ భవన్ ప్రాంగణంలో మోహరించిన ఢిల్లీ పోలీసులతో మమత వాగ్వాదానికి దిగారు.

# కేసీఆర్‌పై అక్కసును మరోసారి బయటపెట్టిన సీఎం




'హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు. సీఎం ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్‌లో చదువుకున్నా రేవంత్‌రెడ్డి మాటతీరు మాత్రం మార్చుకోలేదు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతిపితనే. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే..ఆంధ్రా పాలకుల పక్కన చేరిన మీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది? ప్రశ్నిస్తే కేసులు పెడుతున్న మీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కుందా?' అని ప్రశ్నించారు. ఫోన్‌ట్యాపింగ్ విచారణ దశలో ఉండగా, కోర్టు తీర్పు రాకముందే 'ఇల్లీగల్' అని సీపీ సజ్జనార్ ఎలా నిర్ణయిస్తారని మరో ప్రకటనలో ప్రశ్నించారు. తీర్పులు చెప్పాల్సింది పోలీసులు కాదని, కోర్టులు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

# సిట్ విచారణకు పిలిస్తే వెళ్తా: కవిత



**ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు లో రెండేళ్లవుతున్నా సిట్ విచారణ ముగింపునకు రావడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. విచారణ త్వరగా ముగిసి దోషులకు శిక్ష పడేలా చూడాలని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. సిట్ విచారణలో ఏం జరిగిందో మాజీ సీఎం కేసీఆర్ చెప్తారని భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. "సిట్ విచారణను తప్పుపడుతూ కేటీఆర్ మాట్లాడటం సరికాదు. చట్టాలను అందరూ గౌరవించాలి.. సహకరించాలి. గుంట నక్కలతో కలిసి కాంగ్రెస్ డ్రామాలాడుతోంది. నాతో పాటు నా భర్త ఫోన్లు ట్యాప్ చేశారనే అనుమానాలున్నాయి. సిట్ అధికారులు విచారణకు పిలిస్తే వెళ్లి సహకరిస్తాను" అని కవిత అన్నారు.**

# భారత్‌కు ట్రంప్ భారీ శుభవార్త

## ..వాణిజ్య సుంకాలు 25 నుంచి 18 శాతానికి తగ్గింపు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాకు భారీ శుభవార్త చెప్పారు. భారత్‌పై పరస్పర వాణిజ్య సుంకాలను 25 నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్రూత్‌లో టారిఫ్‌ల తగ్గింపుపై ట్రంప్ ప్రకటన చేశారు. ప్రధాని మోడీ పట్ల తనకున్న గౌరవం, స్నేహం కారణంగా సుంకాలను 18 శాతానికి తగ్గించినట్లు పేర్కొన్నారు. ఇండియా, అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌కు కుదిరిందని తెలిపారు. ఇండియా, అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి సోమవారం (ఫిబ్రవరి 2) ప్రధాని మోడీ, ట్రంప్ ఫోన్‌లో చర్చించారు. ఈ విషయాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా ట్రూత్ సోషల్ ద్వారా వెల్లడించారు. "సోమవారం (ఫిబ్రవరి 2) ఉదయం భారత ప్రధాని మోడీతో మాట్లాడా. మేము వాణిజ్యం, రష్యా -ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడం వంటి అనేక విషయాల గురించి చర్చించాం. రష్యన్ చమురు కొనుగోలును ఆపడానికి.. అమెరికా, వెనిజులా నుంచి ఇంధనం కొనుగోలు చేయడానికి ఆయన అంగీకరించారు. మోడీతో మాట్లాడటం గౌరవంగా ఉంది. ఆయన నా అత్యంత సన్నిహితులలో ఒకరు. మోడీ దేశానికి శక్తివంతమైన, గౌరవనీయ నాయకుడు" అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి ఇండియా ఆయిల్ కొనుగోలు చేయడం ఆపేదయం వేలాది మంది ప్రాణాలను బలిగొన్న ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడంలో సహాయపడుతుందని అన్నారు. భారత్‌తో మా బంధం మరింత బలంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

## ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు..

# దూసుకెళ్లిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. బడ్జెట్‌లో పన్నుపోటుతో నిన్నటి స్పెషల్‌లో భారీ నష్టాలు మూటగట్టుకున్న సూచీలు.. బడ్జెట్‌లోని ఇతర అంశాలపై మదుపర్లు దృష్టి సారించడంతో నేడు దూసుకెళ్లాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమై ఓ మోస్తరు శ్రేణి లాభాల్లో కదలాడిన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. దీంతో మదుపర్లు సంపద ఒక్కరోజులోనే దాదాపు రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.455 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ మళ్లీ 25వేల మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 80,555.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,722.94) నష్టాల్లో ప్రారంభమైంది.

ఇంట్రాడేలో 81,732.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 943.52 పాయింట్ల లాభంతో 81,666.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 252.95 పాయింట్ల లాభంతో 25,088.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.50గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, ట్రెంట్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4,680 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# సాఫ్ట్‌వేర్ బూమ్ మళ్లీ వస్తుందా?




దేశంలో 90ల నాటి సాఫ్ట్‌వేర్ బూమ్ మళ్లీ వస్తుందా? అంటే అవుననే అంటున్నారు ప్రముఖ మార్కెట్ వేత్త, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చైర్మన్, సహ వ్యవస్థాపకుడు రామ్‌దేవ్ అగర్వాల్. కేంద్ర బడ్జెట్ 2026ను ఆయన "భారతదేశ డిజిటల్ భవిష్యత్తుకు మాస్టర్ స్ట్రోక్"గా అభివర్ణించారు. 2047 వరకు డేటా సెంటర్లకు 100% ట్యాక్స్ హాలిడే (పన్ను రహితం) అందించే విధాన నిర్ణయాన్ని ఆయన "1,000 పౌండ్ల గొరిల్లా" (అత్యంత శక్తివంతమైన) తరహా నిర్ణయంగా పేర్కొన్నారు. ప్రస్తుత డిజిటల్ పురోగతిని 1990ల సాఫ్ట్‌వేర్ బూమ్‌తో పోలుస్తూ.. "మనం ఇప్పటికే ఏఐ(AI)ని స్వీకరించాం. ఇప్పుడు 'ఏఐ ఫ్యాక్టరీ ఆఫ్ ది వరల్డ్'ను నిర్మిస్తున్నాం. విద్యుత్, కేబుల్స్, మౌలిక సదుపాయాల్లో భారీ మూలధనం పెట్టుబడి పెడుతున్నాం" అని రామ్‌దేవ్ అగర్వాల్ తెలిపారు. మరోవైపు కేంద్ర బడ్జెట్ 2026లో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (STT) పెరగడం వల్ల సమీప కాలంలో మార్కెట్లకు హెడ్‌విండ్స్ ఉన్నాయని అంగీకరించారు. అయితే దేశ దీర్ఘకాలిక ఆదాయ కథ బలంగా కొనసాగుతోందని రామ్‌దేవ్ అగర్వాల్ స్పష్టం చేశారు.

"4.3% ద్రవ్యలోటు లక్ష్యం, రూ.12.2 లక్షల కోట్ల క్యాపెక్స్ పుష్‌తో, దీర్ఘకాలంలో భారతదేశమే నిజమైన విజేత" అని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం.. ఫ్యూచర్స్‌పై ఎస్‌టీటీ 0.02% నుంచి 0.05 శాతానికి, ఆప్షన్స్ ప్రీమియంపై 0.10% నుంచి 0.15%కి పెరిగింది. అలాగే ఆప్షన్ ఎక్సర్సైజ్‌పై పన్ను 0.125% నుంచి 0.15 శాతానికి ఎగిసింది. ఈ చర్యలు స్వల్పకాలిక ట్రేడింగ్ కార్యకలాపాలను తగ్గించవచ్చని అగర్వాల్ అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌లోని సూక్ష్మ అంశాలు కూడా అంతే ప్రాధాన్యత కలవని ఆయన అన్నారు. ఐటీ సేవల నిర్వచనాన్ని విస్తరించడం వల్ల గ్లోబల్ కెపాసిటీ సెంటర్లకు (GCC) బదిలీ ధరలపై స్పష్టత లభించిందని, ఇది హైఎండ్ టెక్నాలజీ వ్యాపారాలకు భారత్ స్వాగతం పలుకుతోందనే బలమైన సంకేతం అని పేర్కొన్నారు.

# మహిళలకు 40 గ్రా... పురుషులకు 20 గ్రా.

**–అమల్లోకి వచ్చిన బ్యాగేజీ నిబంధనలు-2026**

**–విదేశాల నుంచి పసిడి ఆభరణాలు తెచ్చుకునేందుకు గరిష్ఠ పరిమితి ఇది**



విదేశాల నుంచి విమానం లేదా సముద్ర మార్గాల్లో మనదేశానికి వచ్చే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళా ప్రయాణికులు 40 గ్రాముల వరకు, పురుషులు 20 గ్రాముల వరకు బంగారు ఆభరణాలను సుంకం లేకుండా తీసుకురావచ్చని తెలిపింది. అయితే వీరు ఏడాదికి పైగా విదేశాల్లో నివసిస్తూ, తిరిగి వస్తున్న వారు లేదా భారత సంతతి పర్యాటకులైనా కావచ్చు. గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఈ ఆభరణాలు కచ్చితంగా వ్యక్తిగత వినియోగం కోసమే తీసుకురావాలి. బిస్కెట్లు, కడ్డీల రూపంలో ఉండే పసిడికి ఈ మినహాయింపు లభించదు. ఇప్పటివరకు మహిళలు రూ.లక్ష, పురుషులు రూ.50 వేల విలువైన ఆభరణాలే ఇలా తెచ్చుకోవచ్చు. 2016 నాటి పాత నిబంధనల స్థానంలో, రూపొందించిన 'బ్యాగేజీ నిబంధనలు 2026' ఈనెల 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) సోమవారం తెలిపింది. ఈ ప్రకారం.. విదేశాల నుంచి తిరిగి వచ్చే భారతీయ నివాసితులు, విదేశాల్లో స్థిరపడిన భారత సంతతి పర్యాటకులు లేదా పర్యాటక వీసా కాకుండా ఇతర వీసాలపై వచ్చే విదేశీయులు, తమ వెంట తీసుకొచ్చే రూ.75,000 విలువైన వస్తువులపై కస్టమ్స్ సుంకం (డ్యూటీ) మినహాయింపు ఉంటుంది. గతంలో ఈ పరిమితి రూ.50,000 మాత్రమే. ఇకపై వీరు వ్యక్తిగత వినియోగం కోసం రూ.75,000 విలువైన వస్తువులను కస్టమ్స్ సుంకం చెల్లించకుండానే ఇక్కడకు తీసుకురావొచ్చు. రెండేళ్ల లోపు వయసున్న పిల్లలకు ఈ మినహాయింపు వర్తించదు. విదేశీయులకు ప్రత్యేక పరిమితి: విమానం లేదా నౌకలపై వచ్చే విదేశీ పర్యాటకులు రూ.25,000 విలువైన కొత్త వస్తువులనే సుంకం లేకుండా తీసుకురాగలరు. భూమార్గం (రోడ్డు లేదా రైలు) ద్వారా వచ్చే ప్రయాణికులకు వారి వ్యక్తిగత అవసరాలకు వాడే పాత వస్తువులపైనే మినహాయింపు ఉంటుంది.

**--ఎలక్ట్రానిక్ వస్తువులుజ.....:** 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న ప్రయాణికులు (విమాన సిబ్బంది కాకుండా) అదనంగా ఒక కొత్త ల్యాప్‌టాప్ లేదా నోట్‌ప్యాడ్‌ను సుంకం లేకుండా తమ లగేజీలో తీసుకురావచ్చు. ప్రయాణంలో వ్యక్తిగత అవసరాల కోసం తెచ్చుకునే పాత వస్తువులపై (దుస్తులు, ఇతర పరికరాలు) ఎలాంటి సుంకం ఉండదు.

**--శాశ్వతంగా తిరిగి వస్తుంటే....** ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాల వల్ల విదేశాల్లో ఉండి, ఇప్పుడు శాశ్వతంగా భారత్‌కు తిరిగి వచ్చే వారికి, నివాస కాలం ఆధారంగా గృహోపకరణాలపై ప్రత్యేక మినహాయింపులు లభిస్తాయి.

**--విదేశాల్లో 312 నెలలు నివాసం ఉన్న వారికి రూ.1,50,000 విలువైన గృహోపకరణాలు...** గత రెండేళ్లలో ఏడాదిపాటు విదేశాల్లో ఉన్న వారు రూ.3 లక్షల విలువైన వస్తువులను తీసుకురావొచ్చు. కనీసం రెండేళ్లు విదేశాల్లో ఉండి, తిరిగి వచ్చేవారు గరిష్ఠంగా రూ.7.50 లక్షల విలువైన వస్తువులను సుంకం లేకుండా తెచ్చుకోవచ్చు.

**--దిగివస్తున్న బంగారం, వెండి ధరలు......** బంగారం, వెండి ధరల్లో దిద్దుబాటు కొనసాగుతోంది. ఔన్సు (31.10 గ్రా) బంగారం ధర సోమవారం రాత్రి 11.55 గంటల సమయానికి 263 డాలర్లు తగ్గి 4629 డాలర్ల వద్ద ఉంది. ఒకదశలో బంగారం ధర 4413 డాలర్లకు దిగి వచ్చినా, మళ్లీ కాస్త కోలుకుంది. ఔన్సు వెండి ధర 8 డాలర్లు నష్టపోయి 76 డాలర్ల వద్ద ఉంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,50,000, కిలో వెండి ధర రూ.2,48,490 (పన్నులతో కలిపి) వద్ద స్థిరపడింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ఫిబ్రవరి కాంట్రాక్టు ధర రూ.1,41,900, కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2,32,500 వద్ద స్థిరపడింది.

**--బదిలీ కుదరదు.....** సుంకం మినహాయింపు పరిమితి పూర్తిగా వ్యక్తిగతం. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉంటే, వారికి విడివిడిగానే ఈ పరిమితులు వర్తిస్తాయి.

ఒక ప్రయాణికుడికి ఉన్న పరిమితిని మరొకరితో పంచుకునేందుకు, కలపడానికి కుదరదు. 2 లీటర్ల మద్యం, 100 సిగరెట్లు, 125 గ్రాముల పొగాకు ఉత్పత్తుల వరకు సుంకం వర్తించదు. తుపాకులు, ఆభరణాలు కాని బంగారం లేదా వెండి, టీవీ వంటి వస్తువులకు సాధారణ సుంకం మినహాయింపు వర్తించదు. విమాన లేదా నౌకా సిబ్బంది తమ విధుల్లో భాగంగా వస్తుంటే.. వారు రూ.2,500 విలువైన చాక్లెట్లు, సౌందర్య సాధనాలను సుంకం లేకుండా తేగలరు. విదేశీ కరెన్సీని దేశంలోకి తేవడం, బయటకు తీసుకెళ్లడం 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ 2015' నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని సీబీఐసీ పేర్కొంది.

# బడ్జెట్ దెబ్బతో లిక్కర్ రేట్లకు రెక్కలు..

# రూ.వెయ్యి బాటిల్ రేటు ఇప్పుడు ఎంతంటే..?






ప్రతి ఏటా బడ్జెట్ అనగానే సామాన్యుడు మొట్టమొదట వెతికేది.. ఏ వస్తువుల ధరలు తగ్గాయి.. ఏవి పెరిగాయి అనే. కేంద్ర బడ్జెట్ 2026లో ఈసారి కూడా 'సిన్ గూడ్స్' అంటే మద్యం, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల ధరలపై భారం పడింది. పాత ధరలతో పోలిస్తే ఇప్పుడు మద్యం బాటిల్ కొనాలన్నా, సిగరెట్ ప్యాకెట్ పట్టాలన్నా జేబుకు పెద్ద చిల్లే పడుతోంది. ముఖ్యంగా మద్యం ప్రియులకు ఈ బడ్జెట్ పెద్ద షాక్ ఇచ్చిందనే చెప్పాలి. నిజానికి మద్యంపై పన్నులు విధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉన్నప్పటికీ.. కేంద్ర బడ్జెట్ లో తీసుకునే కొన్ని సాంకేతిక నిర్ణయాలు వీటి ధరలపై ప్రభావం చూపుతాయి. ఈసారి బడ్జెట్‌లో ఆల్కహాల్ స్క్రాప్, మినరల్ సేల్స్ మీద ఉండే TCS ను గతంలో ఉన్న 1 శాతం నుంచి 2 శాతానికి పెంచారు. ఇది చిన్న మార్పులా అనిపించినా.. సప్లై చైన్ ద్వారా తయారీదారుల నుండి వినియోగదారుడికి చేరేసరికి ధర భారీగానే పెరుగుతుంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎక్సైజ్ సుంకాలను సవరించే అవకాశం ఉండటంతో ధరల పెరుగుదల అనివార్యంగా మారింది. పన్ను మార్పుల వల్ల గతంలో రూ.వెయ్యి ఉన్న ఒక మద్యం బాటిల్ ధర ఇప్పుడు సుమారు రూ.1,050 నుండి రూ.1,100 వరకు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రాల వారీగా ఉండే ఎక్సైజ్ నిబంధనలను బట్టి ఈ ధరలో మార్పులు ఉండవచ్చు. సిగరెట్ల విషయానికొస్తే వీటిపై దాదాపు 40 శాతం జీఎస్టీతో పాటు అదనపు సెస్, ఎక్సైజ్ డ్యూటీలను విధించారు. దీనివల్ల పొగ తాగే అలవాటు ఉన్న వారికి నెలవారీ ఖర్చులు భారీగా పెరగనున్నాయి. అయితే బీడీల రేట్లు మాత్రం పెద్దగా మారలేదు. ఇది ఆ రంగంపై ఆధారపడిన కార్మికులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వాలు ఈ రకమైన పన్నుల పెంపు ద్వారా భారీగా ఆదాయాన్ని ఆర్జించాలని చూస్తున్నాయి. వినియోగం తగ్గకపోతే ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షం కురుస్తుంది. అయితే ఆరోగ్య నిపుణులు మాత్రం పన్నులు పెంచి ధరలు పెంచడం వల్ల ప్రజలు ఈ అలవాట్లకు దూరమవుతారని ఆశిస్తున్నారు. ఏది ఏమైనా బడ్జెట్ 2026 తర్వాత సగటు మధ్యతరగతి కుటుంబంలో విలాసాల కోసం కేటాయించే బడ్జెట్‌ను ఖచ్చితంగా తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ప్రీమియం స్మార్ట్‌ఫోన్లపై మోజు.. యాపిల్‌కు రికార్డు వాటా



దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో యాపిల్ హవా కొనసాగుతోంది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతుండడం యాపిల్‌కు కలిసొచ్చింది. 2025లో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో విలువ పరంగా యాపిల్ 28 శాతం మార్కెట్ వాటా సాధించింది. ఇప్పటి వరకు యాపిల్‌కిదే అత్యధిక వాటా కావడం గమనార్హం. అంతకుముందు ఏడాది (2024)లో విలువ పరంగా యాపిల్ వాటా 23 శాతంగా ఉందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ రిపోర్ట్ పేర్కొంది. ముఖ్యంగా యాపిల్ మార్కెట్ వాటా పెరుగుదలలో ఐఫోన్ 16 కీలక భూమిక పోషించింది. 2025లో అత్యధిక అమ్ముడైన మోడల్‌గా నిలిచింది. ఐఫోన్ 16 విక్రయాలు, ఫెస్టివల్ ప్రమోషన్లు, ఫైనాన్సింగ్ సదుపాయాలు (EMI) తదితర కారణాలు విలువ పరంగా యాపిల్‌ను అగ్రస్థానంలో నిలబెట్టాయి. 2025లో దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 1 శాతం వృద్ధి చెందగా.. విలువ పరంగా 8 శాతం వృద్ధి నమోదైంది.

**--ఈఎంఐ కొనుగోళ్లే....** దేశంలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్లకు (రూ.30వేల పైబడిన) గిరాకీ పెరుగుతోంది. అయితే, ప్రీమియం సెగ్మెంట్‌లో మూడింట రెండొంతుల కొనుగోళ్లు ఫైనాన్సింగ్ ద్వారానే జరుగుతున్నాయని నివేదిక పేర్కొంది. ప్రీమియం ఫోన్లకు అప్‌గ్రేడ్ అయ్యేందుకు ఈఎంఐ సదుపాయాన్ని విస్తృతంగా వాడుతున్నారని నివేదిక తెలిపింది. అందుకే ఎంట్రీలెవల్, బడ్జెట్ సెగ్మెంట్ స్మార్ట్‌ఫోన్లతో పోలిస్తే ఈ సెగ్మెంట్ వేగంగా వృద్ధి చెందుతోందని నివేదిక తెలిపింది. సంఖ్యాపరంగా 11 శాతం, విలువ పరంగా 22 శాతం వృద్ధి చెందిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ పేర్కొన్నారు. విలువ పరంగా యాపిల్ అగ్రస్థానంలో ఉండగా.. ఫోల్డబుల్ ఫోన్ సెగ్మెంట్‌లో శాంసంగ్ సంఖ్యాపరంగా 88 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. విలువ పరంగా కంపెనీ మొత్తం వాటా అంతకుముందు ఏడాదితో పోలిస్తే 28 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఏ, ఎం, ఎఫ్, ఎస్ సిరీస్ స్మార్ట్‌ఫోన్ల ద్వారా అన్నివర్గాల వినియోగదారులను చేరుకుంటోందని పేర్కొంది. మోటోరొలా (54 శాతం) వేగంగా వృద్ధి చెందుతున్న బ్రాండ్‌గా నిలవగా.. సీఎంఎఫ్ (83 శాతం) వేగవంతమైన వృద్ధి నమోదు చేస్తున్న సబ్‌బ్రాండ్‌గా నిలిచింది. మొమరీల ధరలు పెరుగుదల వల్ల (రూ.15 వేల్లోపు) 2026 స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో సింగిల్ డిజిట్ వృద్ధి మాత్రమే నమోదు కావొచ్చని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ పేర్కొంది.

# బడ్జెట్ నష్టాల నుంచి భారీ లాభాల్లోకి

**–44 పైసలు లాభపడిన రూపాయి**

**–రూ.4.42 లక్షల కోట్లు పెరిగిన సంపద విలువ**

**–ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.1832.46 కోట్లు**

**డీఐఐ కొనుగోళ్లు.. రూ.2446.33 కోట్లు**

బడ్జెట్ రోజు నాటి భారీ నష్టాల నుంచి మన స్టాక్ మార్కెట్ తేరుకుని, లాభాల్లో ముగిసింది. చమురుగ్యాస్, బ్యాంకింగ్, వాహన రంగంలోని దిగ్గజ కంపెనీల షేర్లకు, తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు నేపథ్యం. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడమూ సానుకూల ప్రభావాన్ని చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 44 పైసలు పెరిగి 91.49 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 4.73% తగ్గి 66.04 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.42 లక్షల కోట్లు పెరిగి రూ.455.03 లక్షల కోట్లకు చేరింది.

**నష్టాల్లో మొదలై..:** బీఎస్ఈ సెన్సెక్స్ 80,555.68 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 80,722.94) ఆరంభమైనా, వెంటనే లాభాల్లోకి వచ్చింది. మధ్యలో మళ్లీ నష్టాల్లోకి చేరినా.. మళ్లీ పుంజుకుని ఒక దశలో 81,732.25 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 943.52 పాయింట్ల లాభంతో 81,666.46 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 262.95 పాయింట్లు పెరిగి 25,088.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,679.40 వద్ద కనిష్ఠాన్ని, 25,108.10 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

**5 మినహా:** సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 మినహా మిగతావి రాణించాయి. పవర్‌గ్రిడ్ 7.61%, అదానీ పోర్ట్స్ 4.76%, బీఈఎల్ 3.33%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.28%, మహీంద్రా&మహీంద్రా 2.97%, ఎల్ అండ్‌టీ 2.86%, ఇండిగో 2.13% పెరిగాయి. ఇన్ఫోసిస్ 1.85%, యాక్సిస్ బ్యాంక్ 1.53%, టైటన్ 0.88%, టీసీఎస్ 0.5%, ట్రెంట్ 0.33% నష్టపోయాయి.

**--కోలుకున్న స్టాక్‌బ్రోకింగ్ సంస్థల షేర్లు...** ఎస్‌టీటీ పెంపు నేపథ్యంలో, ఆదివారం నష్టపోయిన స్టాక్‌బ్రోకింగ్ సంస్థల షేర్లల్లో చాలా వరకు సోమవారం కోలుకున్నాయి. ఏంజెల్ వన్ 3.89%, మోనార్క్ నెట్‌వర్త్ కేపిటల్ 3.34%, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 2.72%, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 1.79%, 5పైసా కేపిటల్ 1.05%, దోలత్ ఆల్గోటెక్ 0.39% పెరిగాయి. గ్రో షేర్లు మాత్రం 2.29% నష్టపోయాయి.

**--జనవరిలో ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.36,000 కోట్లు...** అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో, ఈ ఏడాది జనవరిలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) మన ఈక్విటీ మార్కెట్ల నుంచి సుమారు రూ.36,000 కోట్ల (3.97 బిలియన్ డాలర్ల) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. 2025 మొత్తం మీద ఎఫ్‌పీఐలు రూ.1.66 లక్షల కోట్ల అమ్మకాలు జరిపారు. అదే రీతిలో కొత్త ఏడాదిలోనూ అమ్మకాలు కొనసాగించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం, దేశీయంగా షేర్ల విలువలు అధికంగా ఉన్నాయనే భావనతో వారు అమ్మకాలను కొనసాగిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. 202627 బడ్జెట్లో డెరివేటివ్‌లపై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ)ను పెంచిన నేపథ్యంలో, భవిష్యత్తులో ఎఫ్‌పీఐల పెట్టుబడుల రాక ఎలా ఉంటుందో గమనించాల్సిందే.


**--ఎన్ఎస్ఈ సీఈఓతో మంత్రి గోయల్ సమావేశం....** 202627 వార్షిక బడ్జెట్‌తో కలగనున్న విస్తృత ప్రయోజనాలను ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ



ఆశిష్ కుమార్ చౌహాన్, మ్యూచువల్ ఫండ్స్, ఆస్తుల నిర్వహణ పరిశ్రమ ఫండ్ మేనేజర్లు, మదుపర్లకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. ఇందుకోసం ఆయన ఎన్ఎస్ఈలో సమావేశం నిర్వహించారు. 'బడ్జెట్ నిర్ణయాలు అందించే వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సభికులు ఉత్సుకత కనబరచారు. కొత్త ఆలోచనలు, సూచనలు పంచుకున్నారు' అని గోయల్ తెలిపారు.

# వయసు పైబడినా.. స్ఫూర్తినింపే 'డైరెక్షన్'

## ఇక్కడ సింగీతం.. అక్కడ గోపాలకృష్ణన్

94 ఏళ్ల వయసులో దర్శకుడిగా ఓ సినిమాని ప్రకటించి, అందరినీ ఆశ్చర్యపరిచారు సింగీతం శ్రీనివాసరావు. వెండితెరపై ఎన్నో అద్భుతాలు సృష్టించిన ఆయన కొత్త చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మరో సీనియర్ డైరెక్టర్ కూడా కొంత విరామం అనంతరం ఇటీవల ఓ చిత్రాన్ని ప్రారంభించారు. ఆయన వయసు 84 ఏళ్లు. ఇండస్ట్రీలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే ఈ ఇద్దరి దర్శకుల కొత్త ప్రయాణం, గత వైభవం వివరాలివీ.. టాకీ యుగంలో మాటల్లేని సినిమా (పుష్పక విమానం) చేయడం, టెక్నాలజీలేని రోజుల్లో 'ఆదిత్య 369'లాంటి టైమ్ ట్రావెల్ చిత్రం రూపొందించడం సింగీతానికే చెల్లింది. బయోపిక్ 'మయూరి', జానపదం 'భైరవద్వీపం', కమల్‌హాసన్‌ను పొట్టిగా చూపించిన 'విచిత్ర సోదరులు' తదితర చిత్రాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచాయి. 'వెల్‌కమ్ ఒబామా'తో తరువాత డైరెక్షన్‌కు బ్రేక్ ఇచ్చిన సింగీతం.. మళ్లీ ఇన్నాళ్లకు మెగాఫోన్ పట్టారు. ఇది ఆయనకు 61వ చిత్రం. నటీనటుల వివరాలను ఇంకా ప్రకటించలేదుగానీ సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ ఎంపిక కావడం విశేషం. ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ నిర్మిస్తోంది.

**హిట్ కాంబినేషన్....** మమ్ముట్టి హీరోగా అదూర్ గోపాలకృష్ణన్ 'పాదయాత్ర' సినిమా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల వెలువడిన ఈ ప్రకటనతో మలయాళ చిత్ర పరిశ్రమలో ఆసక్తికర చర్చ సాగింది. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు విజయం కావడంతోపాటు అవార్డులూ దక్కించుకోవడం అందుకు కారణం. ఈ కాంబోలో రూపొందిన 'మథిలుకళ్'కు నాలుగు విభాగాల్లో, 'విధేయన్'కు రెండు కేటగిరీల్లో జాతీయ పురస్కారాలు దక్కాయి. వీటి కన్నా ముందు వీరిద్దరు 'అనంతరం' మూవీకి కలిసి పని చేశారు. 2016లో వచ్చిన 'పిన్నెయమ్' తర్వాత గోపాలకృష్ణన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'పాదయాత్ర'నే. మలయాళ చిత్ర పరిశ్రమలో కొత్త ఒరవడి తీసుకొచ్చిన దర్శకుడాయన. 'స్వయంవరం'తో 1972లో డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించారు. కుటుంబాలను కాదనుకుని, ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట ఎలాంటి సమస్యలు ఎదుర్కొందనే కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమాతో గోపాలకృష్ణన్ పేరు మార్మోగింది. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో ఆయన తెరకెక్కించినవి 12 సినిమాలే అయినా దేనికదే ప్రత్యేకం. 'కొడియెట్టం', 'ముఖాముఖం'.. ఇలా వాస్తవానికి దగ్గరగా ఉండే కథలను తెరకెక్కించారు కాబట్టే అన్నింటికీ నేషనల్ అవార్డులు (ఒక్క సినిమా మినహా) వచ్చాయి. కొన్ని సినిమాలు పలు విభాగాల్లో జాతీయ పురస్కారాలు గెలుచుకోవడం ఒకెత్తైతే.. కొన్ని చిత్రాలు అంతర్జాతీయ సినీ వేడుకల్లో ప్రదర్శితం కావడం మరో ఎత్తు. ఫీచర్ ఫిల్మ్స్ చేస్తూనే గోపాలకృష్ణన్.. డాక్యుమెంటరీలు రూపొందించారంటే వాటిపై ఆయనకు ఎంత ఆసక్తి ఉందో అర్థం చేసుకోవచ్చు.

# ఆస్కార్ నామినేషన్స్.. పిన్న వయస్కుడిగా రికార్డు.. ఎవరీ తిమోతి?

యావత్ సినీ రంగం ప్రతిష్ఠాత్మకంగా భావించే అవార్డుల్లో 'ఆస్కార్' ముందుంటుంది. ఆ పురస్కారానికి నామినేట్ అయినా చాలు అనుకునే నటులు, సాంకేతిక నిపుణులు ఎందరో. అలాంటిది ఏకంగా మూడుసార్లు అకాడమీ అవార్డులకు నామినేట్ అయ్యాడు హాలీవుడ్ యాక్టర్ తిమోతీ చాలమేట్ . 30 ఏళ్లకే ఈ ఘనత సాధించడం ఓ రికార్డు. తాజాగా ప్రకటించిన 98వ నామినేషన్ల జాబితాలో ఉత్తమ నటుడిగా 'మార్టీ సుప్రీం' సినిమాతో చోటు దక్కించుకున్నాడు. ఇంతకుముందు.. 'కాల్ మీ బై యువర్ నేమ్' (2017), 'ఏ కంప్లీట్ అన్‌నోన్' (2024) చిత్రాలకు గానూ బెస్ట్ యాక్టర్‌గా నామినేట్ అయ్యాడు. 'హోమ్‌ల్యాండ్' అనే టెలివిజన్ సిరీస్‌తో తిమోతి నట ప్రయాణం మొదలైంది. 'మెన్, విమెన్ అండ్ చిల్డ్రెన్' (2014)తో సినీరంగ ప్రవేశం చేసిన అతడు.. 'ఇంటర్‌స్టెల్లార్'తో మరో మెట్టు ఎక్కాడు. రొమాంటిక్ డ్రామా మూవీ 'కాల్ మీ బై యువర్ నేమ్'తో అంతర్జాతీయంగా క్రేజ్ సంపాదించుకున్నాడు. పలు విభాగాల్లో 'ఆస్కార్' అవార్డులు సొంతం చేసుకున్న 'డ్యూన్'లో అతడే హీరో. ప్రస్తుతం 'డ్యూన్ 3' (Dune 3)లో నటిస్తున్నాడు. ఆస్కార్‌కే కాదు 'బాఫ్టా', 'గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్'కూ తిమోతీ నటించిన పలు చిత్రాలు నామినేట్ కాగా, కొన్ని సినిమాలు పురస్కారాలు దక్కించుకున్నాయి. బెస్ట్ పిక్చర్, బెస్ట్ క్యాస్టింగ్, బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్, బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ సినిమాటోగ్రఫీ విభాగాల్లోనూ 'మార్టిన్ సుప్రీం' నామినేట్ అయింది. మార్చి 15న ఆస్కార్ వేడుక జరగనుంది.



# అదిగో పెళ్లి.. ఇదిగో గర్భం

### సినీ తారలకు తలనొప్పులు

'వాదు చిన్నదైనా అది వేధిస్తుందోయ్ వధువును, నింద చిన్నదైనా అది నిలదీస్తుందోయ్ పరువును' అంటారు సినారె ప్రపంచపదుల్లో. 'అదిగో పులి' అని ఎవరో అనగానే 'ఇదిగో తోక' అంటూ అందిపుచ్చుకొని ముందుకు తోసేసే సామాజిక మాధ్యమాల సహజీవులందరికీ వర్తించే సత్యమిది. ప్రజలను ఎక్కువగా ఆకర్షించేవి సినిమాలు, రాజకీయాలు. సామాజిక మాధ్యమాల వేదికగా వీటిపై చర్చకు అడ్డూ, అదుపు ఉండదు. చాలావరకూ సినిమా హీరోలు, హీరోయిన్లు వీటి గురించి పెద్దగా పట్టించుకోరు. కానీ, గత కొన్నేళ్లుగా ఇవీ శ్రుతి మించిపోతున్నాయి. అందుకే పలువురు తారలు గట్టిగానే బదులిస్తున్నారు.

**--అంతా మీరే ప్లాన్ చేసేయండి....** ఇండస్ట్రీలో వివాహం కాని అగ్ర కథానాయికల్లో త్రిష ఒకరు. దీంతో త్రిష పెళ్లి ఎప్పుడూ హాట్ టాపికే. ఈ క్రమంలో ఇటీవల ఆమె పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో త్రిష కాస్త ఘాటుగానే స్పందించారు. 'నాకోసం నా జీవితాన్ని ప్లాన్ చేస్తున్న వాళ్లను నేను ప్రేమిస్తా. హనీమూన్ షెడ్యూల్ కూడా చెబుతారేమోనని వేచి చూస్తున్నా' అంటూ వ్యంగ్యంగా పేర్కొన్నారు.

**--నా 16 నెలల ప్రెగ్నెన్సీ.. వరల్డ్ రికార్డు.....** ఇక పెళ్లయిన హీరోయిన్ గురించి అయితే, ఆమె గర్భిణి అంటూ పోస్టులు పెట్టి, నానా హంగామా సృష్టిస్తుంటారు. ఇలాంటి వ్యాఖ్యలే మరోసారి ఆమె చెవిన పడటంతో సోనాక్షి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. "16 నెలలకు పైగా గర్భిణిగా ఉండటం వరల్డ్ రికార్డు (ఏడాది నుంచి తన ప్రెగ్నెన్సీపై రూమర్స్ రావడాన్ని ఉద్దేశించి..). ఉదర భాగంపై చెయ్యి వేసి ఫొటో దిగినందుకు ఇలాంటి వదంతులు సృష్టించారు. వాటికి మా సమాధానం ఇదే" అంటూ ఈ ఫొటోను పంచుకున్నారు. తెలుగు హీరోయిన్ అంజలిది అదే పరిస్థితి. 'నాకు తెలియకుండానే ఇప్పటికి నాలుగుసార్లు పెళ్లి చేశారు. ఇప్పుడు ఐదోసారి చేస్తున్నారు. నేను కూడా సోషల్ మీడియాలో దీని గురించి విన్నాను. నేను పెళ్లి చేసుకొని వేరే ఇంట్లో ఉంటున్నట్లు రాశారు. వాళ్లకు తెలియని విషమేమిటంటే నేను అవుట్ డోర్ షూటింగ్స్‌లోనే ఎక్కువగా ఉంటున్నా. ఆ వార్తకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. అది ఫేక్ న్యూస్. పెళ్లైతే చేసుకుంటా.. కానీ ఇప్పుడు కాదు. దానికి కొంచెం టైమ్ ఉంది' అంటూ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇదే పరిస్థితి మృణాళ్ ఠాకూర్ ఎదుర్కొన్నట్లు తెలిపింది. 'నా స్నేహితులు, స్టైలిస్ట్ డిజైనర్లు, బంధువులు వరుసగా ఫోన్‌కాల్స్ చేసి తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకుంటున్నావా? అని అడుగుతున్నారు. ఆ అబ్బాయి ఎవరో నాకూ తెలుసుకోవాలని ఉంది. ఈ ఫన్నీ రూమర్ గురించి ఏం మాట్లాడాలో కూడా తెలియట్లేదు. త్వరలోనే పెళ్లవుతుంది. అయితే.. వరుడిని మీరే వెతికిపెట్టి నాకు చెప్పండి. కల్యాణ వేదిక, ఆ లోకేషన్ వివరాలు కూడా పంపండి. సరేనా?" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# మోహన్‌లాల్ సమ్మోహన నట శిఖరం.. ఆ ఒక్క ఏడాది 36 సినిమాలు..



సంపూర్ణ నటనకు అసలైన నిర్వచనం మోహన్‌లాల్. అందుకే సినీలోకమంతా ఆయనను 'ది కంప్లీట్ మ్యాన్' అని పిలుచుకుంటుంది. నీరు ఏ పాత్రలో పోస్తే ఆ రూపంలోకి మారిపోయినట్లు... సినిమాల్లో ఏ పాత్రనిచ్చినా అందులోకి ఒదిగిపోతారు. అందుకే ఆయన నటనకు ప్రేక్షకులే కాదు, అవార్డులు దాసోహమైపోతాయి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా మోహన్‌లాల్ గురించి ఆసక్తికర విశేషాలు..

**--కుస్తీ నుంచి వెండితెరకు....** మోహన్‌లాల్ అసలు పేరు మోహన్‌లాల్ విశ్వనాథ్ నాయర్. రెండు సార్లు కుస్తీ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన లాలెట్టన్.. ఆరో తరగతిలోనే నటనలోకి అడుగుపెట్టారు. ఓ నాటకంలో 90 ఏళ్ల వృద్ధుడిగా నటించి అందరితోనూ ప్రశంసలు పొందారు. స్నేహితులు తీసిన 'తిరనోట్టమ్' సినిమాలో మొదటిసారి నటించారు. అయితే అది విడుదలకు నోచుకోలేదు. ఆ తర్వాత స్నేహితుల బలవంతం మీద ఆడిషన్‌కి వెళ్లి 'మంజిల్ విరింజ పూక్కల్'లో విలన్ పాత్రకు ఎంపికయ్యారు. అది సూపర్ హిట్టయి సినీ పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి బలమైన పునాది వేసింది. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగారు. 'చిత్రం', 'కిరీడం', 'చంద్రలేఖ', 'నరసింహం', 'దృశ్యం', 'పులిమురుగన్', 'లూసిఫర్', 'ఎల్ 2: ఎంపురాన్', 'హృదయపూర్వం' లాంటి ఎన్నో మరపురాని చిత్రాలను అందించారు. కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఒక చిత్రం పూర్తి చేసిన తర్వాతే మరోదాన్ని అంగీకరించేవారు. ఆ తర్వాత తన షెడ్యూల్‌లో మార్పులు చేసుకున్నారు. 1986లో ఏకంగా 36 సినిమాలు చేశారు. అందుకే తనకు రెస్ట్ తీసుకోవడం నచ్చదని చెబుతారు

**--వందకోట్ల క్లబ్ వీరుడు...** 'పులిమురుగన్'తో వందకోట్ల వసూళ్ల మార్క్‌ను అందుకొని ఈ ఘనత సాధించిన తొలి మలయాళ చిత్రంగా నిలిపారు. ఆ తర్వాత వచ్చిన 'లూసిఫర్' రూ.200 కోట్లకు పైగా వసూళ్లను సాధించిపెట్టింది. ఈ ఏడాది విడుదలైన 'ఎల్2: ఎంపురాన్' ఏకంగా రూ.265 కోట్లు వసూలు చేసింది.

**--మల్టీ స్టారర్లలోనూ ముందే..** ప్రతి చిత్ర పరిశ్రమలో ఉండే అగ్ర కథానాయకులు మల్టీస్టారర్ సినిమాలు తీసేందుకు వెనకాడతారు. విజయ్, విశాల్, ఎన్టీఆర్, పృథ్వీరాజ్ సుకుమారన్ లాంటి ఈతరం హీరోల సినిమాల్లో నటించేందుకు సంకోచించలేదు ఈ సూపర్‌స్టార్. జిల్లా, విలన్(2017), జనతా గ్యారేజ్ చిత్రాల్లో యువ హీరోలతో పోటీపడీ మరీ నటించారు. ఇటీవల 'హృదయపూర్వం' యువ నటుడు సంగీత్‌తో కలిసి సందడి చేశారు.

**--పరభాషలోనూ...పాగా...** కథలో దమ్ముండాలే కానీ, భాషతో సంబంధం లేకుండా సినిమాలు తీస్తారాయన. 'ఇరువర్'తో తమిళ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. మణిరత్నం తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆనందన్ పాత్రకు ప్రాణం పోశాడు. ఆర్జీవీ తీసిన 'కంపెనీ'తో బాలీవుడ్‌కి వెళ్లిన ఆయన..'ఆగ్', 'తేజ్' సినిమాల్లో కీలక పాత్రల్లో నటించారు. కన్నడనాట 'లవ్'లో ప్రత్యేక పాత్రలో మెరిశారాయన. తెలుగులో 'జనతా గ్యారేజ్' లాంటి హై వోల్టేజీ డ్రామాలో అంతే పవర్‌ఫుల్ పాత్రలో అదరగొట్టారు. 'మనమంతా' సినిమాతోనూ ఆకట్టుకున్నారు. 'ఇరువర్' షూటింగ్ సమయంలో మోహన్‌లాల్ నటిస్తుంటే కట్ చెప్పడం మర్చిపోయేవారట ఆ సినిమా దర్శకుడు మణిరత్నం. 'అతని నటన అంతగా సమ్మోహితుల్ని చేసింది. అలా ప్రతి సన్నివేశానికి చూస్తూ ఉండిపోతే సినిమా షూటింగ్ ఏం జరుగుతుంది చెప్పండి. అందుకే మోహన్‌లాల్‌తో షూటింగ్ చేయడం కష్టం' అంటారు మణిరత్నం.




# శ్రీనివాస మంగాపురం..

## ..రషా ఫస్ట్ లుక్ అదిరింది

దివంగత సూపర్ స్టార్ కృష్ణ మనుమడు, రమేశ్ బాబు తనయుడు జయకృష్ణ హీరోగా శ్రీనివాస మంగాపురం సినిమాతో ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఆరెక్స్ 100 డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో బాలీవుడ్ స్టార్ కిడ్ ప్రజంట్ యూత్ హార్ట్ త్రోబ్ రషా తడాని హీరోయిన్‌గా టాలీవుడ్ లో అరంగేట్రం చేస్తోంది. వైజయంతీ మూవీస్ అశ్వినీదత్, ఆనంది ఆర్ట్స్ జెమినీ కిరణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా జీవీ ప్రకాశ్ సంగీతం సమకూరుస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదల చేసిన టైటిల్, హీరో ఫస్ట్‌లుక్స్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేయగా తాజాగా సినిమాలో మంగ పాత్ర పోషిస్తున్న కథానాయిక రషా ఫస్ట్ లుక్ రివీల్ చేస్తూ వీడియో గ్లిమ్స్ రిలీజ్ చేశారు. ఓ పూల తోటలో అచ్చ తెలుగమ్మాయి వేషధారణలో రషా లుక్ అదిరింది. కోటి మంది దేవతలు నా పక్కనుండి వెళ్తున్నా...నేను మాత్రం నిన్నే చూస్తూ ఉంటా.. అని శ్రీను చెబుతున్నట్లు నోట్ పెట్టారు. అంతేగాక బ్యాగ్రౌండ్‌లో వచ్చే విజిల్ సౌండ్ హైలెట్‌గా ఉంది. ఈ సినిమా సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మే నెలలో విడుదలవుతుందని తెలుస్తోంది.

# చిరు రికార్డుల వెనుక చరణ్, సుస్మిత..

## '..వరప్రసాద్‌గారు'కు ముందు ఇన్ని జరిగాయా!




బాక్సాఫీస్ వద్ద 'మన శంకర వరప్రసాద్‌గారు' రికార్డులు సృష్టిస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటించిన ఈ మూవీ అత్యంత వేగంగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిన ప్రాంతీయ చిత్రంగా నిలిచింది. తక్కువ బడ్జెట్‌తో రూపొందించిన ఈ మూవీ తెలుగు బాక్సాఫీస్‌కు సరికొత్త పాఠాలు చెబుతున్న నేపథ్యంలో ఈ మూవీ గురించి ఆసక్తికర విషయాలు మీకోసం.. దర్శకుడు అనిల్ రావిపూడి ఈ స్క్రిప్ట్‌ను కేవలం 25 రోజుల్లో పూర్తి చేశారు. ఫస్ట్ హాఫ్ 15 రోజులు.. సెకండాఫ్‌ను 10 రోజుల్లో పూర్తి చేశారు. ఆయన కెరీర్‌లో అత్యంత త్వరగా పూర్తయిన స్క్రిప్ట్ ఇదే.

150కు పైగా చిత్రాలను చేసిన చిరంజీవి నటన జీవితంలో ఎన్నో అధ్యాయాలను చూశారు. అలాంటి హీరోకు కథ రాయాలంటే కత్తి మీద సామే. కానీ, అనిల్ రావిపూడి ఓ సూత్రం పాటించారు. అదే చిరంజీవి చేత.. చిరంజీవి కోసం.. చిరంజీవి నటించిన సినిమాలనే తీసుకుని.. చిరంజీవితో కొత్త సినిమా చేయడం. అగ్ర కథానాయకుల సినిమా అంటే ఏడాదిపైనే పడుతుంది. కానీ, ఈ మూవీ షూటింగ్ కేవలం 85 రోజుల్లో పూర్తి చేయడం గమనార్హం. ఇద్దరు అగ్ర హీరోలు చిరంజీవి, వెంకటేశ్‌లను కలిపి సినిమా చేసిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలకే దక్కుతుంది. కానీ, అసలు ఈ ఆలోచన చేసిన మొదటి వ్యక్తి మాత్రం మరొకరు ఉన్నారు. ఆయనే నిర్మాత డి. రామానాయుడు. 'నిన్ను, వెంకటేశ్‌ను కలిపి సినిమా తీయాలి రాజా.. నువ్వెప్పుడు డేట్స్ ఇస్తావు' అని చిరంజీవిని అడుగుతూ ఉండేవారట. కానీ, సరైన కథ దొరక్క అది పట్టాలెక్కలేదు. ఈ మూవీలో చిరంజీవి సతీమణి సురేఖ పేరు వచ్చేలా గేయ రచయిత అనంత్ శ్రీరామ్ పాట రాశారు. అందుకు కారణం కూడా ఉంది. ఆమె గంభీరంగా ఉంటే సురేఖ అని, సరదాగా ఉంటే రేఖ అని చిరంజీవి పిలుస్తారట. ఈ విషయం తెలిసిన అనంత శ్రీరామ్ ఈ పాటలో ఎలాగైనా రేఖ అనే పేరు పెట్టాలని అనుకున్నారట. 'యురేఖ నువ్వు కేక.. భలే బాగుంది రేఖ..' అని పెట్టారు. కథానాయిక నయనతార తాను నటించిన చిత్రాల ప్రమోషన్స్‌లో పాల్గొనరు. కానీ, అనిల్ రావిపూడి ఆమెను ఒప్పించారు. దీంతో తన రూల్స్‌ను పక్కనపెట్టి ఈ మూవీ కోసం నయన్ చిన్న ప్రమోషన్ వీడియోను కూడా చేశారు. ఇక ఇందులో చిరంజీవికి జోడీగా నటించిన ఆమె.. అంతకుముందు వచ్చిన 'గాడ్‌ఫాదర్'లో ఆయనకు సోదరిగా నటించడం విశేషం. ఈ మూవీ షూటింగ్ జరుగుతున్న సమయంలో నటుడు హర్షవర్ధన్ ఇంటివద్ద జారిపడటంతో ఆయన కాలి మడమకు తీవ్రగాయమైంది. వైద్యులు మూడు నెలలు కదలకూడదని చెప్పారు. అప్పటికి 'మన శంకరవరప్రసాద్‌గారు' 40శాతం షూటింగ్ అయింది. గాయం కారణం చెప్పి దర్శకుడు అనిల్ మరో ఆప్షన్ ఎంచుకోలేదు. నడవలేని స్థితిలో ఉన్న హర్షను కొనసాగిస్తూనే, ఆ విషయం తెరపై కనిపించనీయకుండా చేశారు. 'దురదృష్టాన్ని కూడా అదృష్టంగా చేసేవాడే అనిల్' అంటూ హర్షవర్ధన్ సంతోషం వ్యక్తం చేశారు. చిరంజీవి కెరీర్‌లో ఇప్పటివరకూ అత్యధిక వసూళ్లు సాధించిన మూవీగా 'సైరా నరసింహారెడ్డి' ఉండేది. ఫుల్ రన్‌లో ఆ మూవీ రూ.244 కోట్లు (గ్రాస్) వసూలు చేసింది. ఆ మూవీకి రామ్‌చరణ్ నిర్మాత. ఇప్పుడు 'మన శంకరవరప్రసాద్‌గారు' రూ.300 కోట్లను దాటేసి, చిరు కెరీర్‌లో ఆల్‌టైమ్ హిట్ మూవీగా నిలిచింది. ఈ సినిమాకు నిర్మాతల్లో కుమార్తె సుస్మిత ఒకరు కావడం గమనార్హం. అంటే చిరుకు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలను కొడుకు, కూతురు అందించడం విశేషం. ఈ సినిమాలో 'హుక్ స్టెప్' పాటను గాయకుడు బాబా సెహగల్ ఆలపించారు. 28 ఏళ్ల కిందట 'రిక్షావోడు'లో 'రూప్‌తేరా మస్తానా' తర్వాత చిరంజీవికి ఆయన పాట పాడటం ఇదే కావడం గమనార్హం. అలాగే ఉదిత్ నారాయణ కూడా చాలా రోజుల తర్వాత చిరంజీవి కోసం 'మీసాల పిల్ల' పాట పాడారు. 'మన శంకరవరప్రసాద్‌గారు' తొలి రోజు రూ.84 కోట్లు వసూలు చేస్తే, రెండు రోజుల్లో రూ.120 కోట్లు (గ్రాస్) రాబట్టింది. ఇక కేవలం నాలుగున్నర రోజుల్లోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరింది. వారం రోజుల్లోనే రూ.292+ కోట్లు వసూళ్లు దాటేసి, రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిపోయింది. అతి తక్కువ సమయంలో ఈ ఘనత సాధించిన ప్రాంతీయ మూవీగా రికార్డు సృష్టించింది.

# భారత షట్లర్లకు పరీక్ష

**–ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ నేటి నుంచే**



ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కఠిన సవాల్‌కు సిద్ధమైంది. మంగళవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో భారత మహిళల జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. అయితే స్టార్ షట్లర్ పి.వి.సింధు గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో భారత్‌కు అతి పెద్ద ప్రతికూలత. సింగిల్స్‌లో తన్వి శర్మ, ఉన్నతి హుడా, మాళవిక బాన్సోద్, రష్మిక శ్రీ.. డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ, ప్రియ.కె, శ్రుతి మిశ్రా, తనీషా క్రాస్టోలు భారత్ తరఫున పోరాడనున్నారు. బుధవారం గ్రూపువై పోరులో మయన్మార్‌తో భారత్ తలపడనుంది. 2016, 2020లో కాంస్య పతకాలు సాధించిన భారత పురుషుల జట్టుకు లక్ష్యసేన్ సారథ్యం వహించనున్నాడు. కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్, ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, సాయి ప్రతీక్, పృథ్వీ కృష్ణ మూర్తి, హరిహరన్ ఆధ్వర్యంలో భారత్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గ్రూపుసి పోరులో సింగపూర్‌తో భారత్ పోటీపడనుంది.

## పాక్ ఆ పని చేస్తుందేమో..!: సునీల్ గావస్కర్



టీ20 వరల్డ్‌కప్ 2026లో పాకిస్థాన్, భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన అంశంపై టీమ్‌ఇండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్.. స్పందించాడు. పాక్ క్రికెటర్లు గతంలో తమ రిటైర్మెంట్ నిర్ణయాలను వెనక్కి తీసుకున్నట్లే.. పాకిస్థాన్ కూడా ఈ విషయంలో యూటర్న్ తీసుకోవచ్చని సునీల్‌గావస్కర్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'పాక్.. వారి మాజీ ఆటగాళ్ల నుంచి, ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తినప్పుడు తన వైఖరిని మార్చుకునే అవకాశముంది' అని సునీల్‌గావస్కర్ అన్నాడు. 'ఇందులో కొత్తేముంది? పాకిస్థాన్ క్రికెటర్లు ముందు రిటైర్మెంట్ ప్రకటిస్తారు. నాలుగు రోజుల తర్వాత.. మా అభిమానులు మమ్మల్ని ఇంకా ఆడమన్నారని చెప్పి.. వారు తమ రిటైర్మెంట్లను వెనక్కి తీసుకుంటారు. ఇలాంటిదే మరోసారి జరుగుతుంది. 15వ తేదీ కంటే ముందే ఇది జరగొచ్చు' అని గావస్కర్ పేర్కొన్నాడు. ఒకవేళ తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే.. ఐసీసీ (ICC) తీవ్రమైన చర్యలు తీసుకునే అవకాశముందని సునీల్ గావస్కర్ పాకిస్థాన్‌ను హెచ్చరించాడు. 'మెగా టోర్నీలో భారత్‌తో మ్యాచ్ నుంచి పాక్ వైదొలగడానికి సరైన కారణాలు, ఆధారాలు చూపించలేకపోతే ఐసీసీ చర్యలకు లోనుకావాల్సి వస్తుంది' అని సునీల్ గావస్కర్ అన్నాడు. అయితే భారత్ మాత్రం ఫిబ్రవరి 15న జరగబోయే మ్యాచ్ కోసం.. షెడ్యూల్ ప్రకారం శ్రీలంకకు వెళ్లనుందని తెలుస్తోంది. ఒకవేళ పాకిస్థాన్ జట్టు మ్యాచ్ ఆడేందుకు మైదానంలోకి రాకుంటే.. మ్యాచ్ రిఫరీ తీసుకునే నిర్ణయం కోసం భారత జట్టు ఎదురుచూడనుందని సమాచారం. ప్రస్తుతానికైతే బీసీసీఐ (BCCI) ఈ విషయమై అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే నాకౌట్ దశలో ఇరుదేశాల జట్లు మరోసారి తలపడాల్సి వస్తే పరిస్థితి ఏంటనే దానిమీద ఇంకా పూర్తి స్పష్టత రాలేదు.

## అతడి కెప్టెన్సీలో హిట్‌మ్యాన్ ఛాయలున్నాయి: ఇర్ఫాన్ పఠాన్




కెప్టెన్సీ విషయంలో సూర్యకుమార్ యాదవ్‌కు రావాల్సినంత క్రెడిట్ రావడం లేదని.. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా సూర్య స్టైల్‌లో రోహిత్ శర్మ ఛాయలు ఉన్నాయని అతడు అన్నాడు. 'సూర్యకుమార్ యాదవ్‌కు కెప్టెన్‌గా అద్భుతమైన రికార్డ్ ఉంది. టీ20 ఫార్మాట్లో కెప్టెన్‌గా అతడికి విజయాల శాతం 84. ఇది చాలా ఎక్కువ. కానీ మనం సూర్యకుమార్‌కు ఇవ్వాల్సినంత క్రెడిట్ ఇవ్వడం లేదు. అలాగే సూర్యకుమార్ యాదవ్ బౌలర్ల కెప్టెన్. అతడిలో రోహిత్ శర్మ ఛాయలున్నాయి. అతడు బౌలర్లపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తాడు. జట్టు కోసం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటాడు' అని ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. 'సూర్యకుమార్ యాదవ్ సానుకూల దృక్పథంతో ముందుకుసాగాలి. కెప్టెన్‌గా అతడు కచ్చితంగా వరల్డ్‌కప్ ఆడతాడు. కానీ బ్యాటర్‌గా సూర్య పరుగులు రాబట్టాల్సి ఉంది. అది అతడికి ఎంతో కీలకం' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ రికార్డ్ అద్భుతంగా ఉన్నప్పటికీ, అతడు కొంతకాలంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. ముఖ్యంగా 2025లో అతడు తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. 21 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 218 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అయితే టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026కు ముందు సూర్య తిరిగి ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో రెండు, మూడు టీ20ల్లో వరుసగా రెండు హాఫ్‌సెంచరీలు సాధించాడు. అంతకు ముందు అతడు చివరిసారిగా అక్టోబర్ 2024లో అర్ధశతకం చేశాడు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 వరల్డ్‌కప్ భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో సూర్యకుమార్ యాదవ్ బ్యాట్‌తో విరుచుకుపడాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# మెరుపుల కప్పు.. వచ్చేస్తోంది

**–టీ20 ప్రపంచకప్ మరో 4 రోజుల్లో**




కప్పులందు ప్రపంచకప్ వేరు.. అందులోనూ పొట్టి ఫార్మాట్లో ప్రపంచకప్ అంటే క్రికెట్ అభిమానుల్లో అమితాసక్తి ఉంటుంది. రోహిత్ సేన బ్రిడ్జ్‌టౌన్‌లో నమ్మశక్యం కాని విజయంతో ప్రపంచకప్‌ను ఒడిసిపట్టిన క్షణాలు ఇంకా కళ్ల ముందు కదలాడుతుండగానే.. ఇంకో కప్పు వచ్చేసింది. ఈసారి ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమివ్వబోయేది భారతే కావడం విశేషం. కొన్ని మ్యాచ్‌లు శ్రీలంకలోనూ జరగబోతున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమ్‌ఇండియా.. అదిరే ఫామ్‌తో టోర్నీలో అడుగుపెడుతోంది. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచాక ఈ ఫార్మాట్లో భారత జట్టు ఒక్క సిరీస్ కూడా ఓడిపోకపోవడం గమనార్హం. దీంతో సూర్యకుమార్‌సేనపై భారీ అంచనాలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ లాంటి జట్లూ బలంగా కనిపిస్తున్నాయి. కిందటిసారి లాగే ఈసారి కూడా అత్యధికంగా 20 జట్లతో పొట్టి ప్రపంచకప్ జరగబోతోంది. తొలిసారిగా బంగ్లాదేశ్ ఈ టోర్నీలో బరిలోకి దిగట్లేదు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగట్లేదన్న సంగతి తెలిసిందే. అయినా సరే టోర్నీపై ఆసక్తి ఏమీ తక్కువగా లేదు. ఈ నెల 7న మొదలై, మార్చి 8న ఫైనల్‌తో ముగిసే టోర్నీలో మెరుపులకు లోటు లేనట్లే.

**--ఫార్మాట్ ఇలా.....** ప్రపంచకప్‌లో బరిలోకి దిగుతున్న 20 జట్లను అయిదు చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్‌లో ప్రతి జట్టూ మిగతా నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 8కు అర్హత సాధిస్తాయి. అందులో నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లు ఉంటాయి. ప్రతి జట్టూ మిగతా మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. రెండు గ్రూప్‌ల్లో టాప్ 2 జట్లు సెమీస్‌లో చోటు దక్కించుకుంటాయి.

**--ఏ జట్టు ఏ గ్రూప్‌లో? ....** గ్రూప్‌ఎ: భారత్, పాకిస్థాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా, గ్రూప్‌బి: ఆస్ట్రేలియా, శ్రీలంక, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్, గ్రూప్‌సి: ఇంగ్లాండ్, వెస్టిండీస్, నేపాల్, ఇటలీ, స్కాట్లాండ్, గ్రూప్‌డి: న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, కెనడా, యూఏఈ

# ఆర్సీబీని ఢీకొట్టేదెవరో!

**–నేడే దిల్లీ-గుజరాత్ ఎలిమినేటర్**

**–రాత్రి.7.30 నుంచి**




డబ్ల్యూపీఎల్ 4లో ఆసక్తికర సమరానికి వేళైంది. మంగళవారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో దిల్లీ క్యాపిటల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. తొలి మూడు సీజన్లలో ఫైనల్‌కు దూసుకెళ్లిన దిల్లీ.. మరోసారి టైటిల్ సమరానికి అర్హత సాధించాలనే పట్టుదలతో ఉంది. జెమీమా సారథ్యంలోని దిల్లీ పయనం లీగ్ దశలో ఒడుదొడుకులతో సాగింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచి.. నాలుగు ఓడింది. మరోవైపు గుజరాత్ 5 మ్యాచ్‌లు నెగ్గి.. మూడింట్లో ఓడి రెండో స్థానంతో ముందంజ వేసింది. ఈ సీజన్లో వెలుగులోకి వచ్చిన పేసర్ నందని శర్మపై మరోసారి దిల్లీ ఆశలు పెట్టుకుంది. కీలక సమయాల్లో వికెట్లు తీయడమే కాక.. డెత్ ఓవర్లలో బ్యాటర్లకు కళ్లెం వేసి నందని ఆకట్టుకుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీచరణి రాణించడం కూడా దిల్లీకి కీలకం. నందని, శ్రీచరణి ఈ సీజన్లో చెరో 14 వికెట్లు పడగొట్టారు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మరిజేన్ కాప్ ఆ జట్టుకు ప్రధాన బలం. ముంబయితో గత మ్యాచ్‌లో ఆమె బంతితో ప్రత్యర్థిని దెబ్బ కొట్టింది. జెమీమా, లారా వోల్వార్ట్, లిజెలీ లీ, షెఫాలి వర్మలతో దిల్లీ బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఈ సీజన్లో లారా వోల్వార్ట్, లిజెలీ, షెఫాలి 200పైన పరుగులు చేశారు. చివరి లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్‌ను ఓడించడం దిల్లీ ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచేదే. అయితే ఆష్లీ గార్డ్‌నర్ నాయకత్వంలోని గుజరాత్‌ను తక్కువ అంచనా వేస్తే దిల్లీకి చేదు అనుభవం తప్పదు. ఆష్లీతో పాటు సోఫీ డివైన్, బెత్ మూనీ, జార్జియా వేర్‌హామ్‌ల రూపంలో ప్రపంచ స్థాయి స్టార్ల బలం ఆ జట్టుకు ఉంది. ముఖ్యంగా సోఫీ డివైన్ బంతి, బ్యాట్‌తో అదరగొడుతోంది. ఆమె ఇప్పటిదాకా 237 పరుగులు చేసి.. 17 వికెట్లు పడగొట్టింది. ఎలిమినేటర్‌లోనూ ఆమె రాణిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో పేసర్ రేణుక సింగ్ సత్తా చాటడం ఆ జట్టుకు ముఖ్యం. ఎలిమినేటర్‌లో గెలిచే జట్టు.. గురువారం ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొంటుంది.

# భారత్, పాక్ మ్యాచ్ జరగకపోతే రూ.4,500 కోట్ల నష్టం




టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో లీగ్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సి ఉంది. పాక్ తీసుకున్న నిర్ణయంపై ఐసీసీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ఏ ఐసీసీ టోర్నీలో అయినా ఈ చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరుపై ఎంతో ఆసక్తి ఉంటుంది. అందుకే ఏ మ్యాచ్‌కు రానంత రికార్డు స్థాయి వ్యూస్ దాయాదుల పోరుకు వస్తాయి. ప్రసార హక్కులు, ప్రకటనలు, స్పాన్సర్‌షిప్‌లు, టికెట్ల విక్రయాలు తదితర వాణిజ్య కార్యకలాపాలతో కలిపి ఈ సారి భారత్, పాక్ మ్యాచ్ విలువ దాదాపు రూ.4,500 కోట్లుగా అంచనా వేశారు. ఇందులో టీవీ, డిజిటల్ ప్రసారాల ద్వారా వచ్చే ఆదాయమే ఎక్కువ. భారత్, పాక్ టీ20 మ్యాచ్ కోసం ప్రకటనల ధరలు 10 సెకన్ల స్లాట్‌కు రూ. 2540 లక్షల మధ్య ఉంటుంది. ఓవరాల్‌గా ప్రకటనల ద్వారానే రూ.300 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. ప్రపంచ కప్‌లో సగటున ఒక మ్యాచ్ విలువ రూ.138 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. ఇండియా, పాకిస్థాన్ ఈ సారి తలపడకపోతే ప్రసారకర్తలు ప్రకటనల ఆదాయంలో తీవ్రంగా నష్టపోతారు. అంతేకాదు టోర్నమెంట్‌లో మిగిలిన మ్యాచ్‌ల వ్యూస్‌పై ప్రభావం పడుతుంది. దీంతో వారి రాబడి మరింత తగ్గుతుంది. బ్రాడ్‌కాస్టర్లకు మొత్తం రూ.370400 కోట్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. ఈ నష్టాన్ని ఐసీసీ భరిస్తుంది. కానీ, ఆ మేరకు సభ్యదేశాలకు పంచే ఆదాయాన్ని తగ్గిస్తుంది. ఈ చర్యలతో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాలకు పెద్ద ఇబ్బంది ఉండదు. ఐసీసీ నుంచి వచ్చే ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడే చిన్న దేశాలు మాత్రం తీవ్రంగా నష్టపోతాయి. భారత్, పాక్ రద్దయితే ఈ రెండు దేశాలు దాదాపు రూ.200 కోట్ల చొప్పున నష్టపోనున్నట్లు తెలుస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న బీసీసీఐపై దీని ఇంపాక్ట్ ఎక్కువగా ఉండదు. పీసీబీకి మాత్రం చాలా నష్టం వాటిల్లుతుంది. ఐసీసీ మొత్తం ఆదాయంలో పాక్ క్రికెట్ బోర్డు.. 5.75 శాతం అందుకుంటుంది, ఇది సంవత్సరానికి 34.51 మిలియన్ డాలర్లు. ఏ జట్టు అయినా ఒక మ్యాచ్‌ను స్వచ్ఛందంగా బహిష్కరిస్తే దానికి బీమా రక్షణ ఉండదు. దీంతో పీసీబీ పెనాల్టీలు, ప్రసారకర్తల నుంచి చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# క్వార్టర్స్‌లో ఆంధ్ర



రంజీ ట్రోఫీలో ఆంధ్ర క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. నాగాలాండ్‌తో ఎలీట్ గ్రూపుఎ చివరి లీగ్ మ్యాచ్‌ను డ్రాగా ముగించిన ఆంధ్ర.. తొలి ఇన్నింగ్స్ ఆధారంగా 3 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 85/4తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 104 ఓవర్లలో 342 పరుగులకు ఆలౌటైంది. చేతన్ బిష్ట్ (100), నగాహో చిషి (79) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురణ విజయ్ (5/104), సౌరభ్ కుమార్ (4/116) మెరిశారు. అనంతరం 173 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆంధ్ర.. ఆట నిలిచే సమయానికి 4 వికెట్లకు 64 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో నాగాలాండ్ 366 పరుగులకు ఆలౌటవగా.. 536/9 స్కోరు వద్ద ఆంధ్ర డిక్లేర్ చేసింది. ఏడు మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 3 డ్రాలతో 31 పాయింట్లు సాధించిన ఆంధ్ర... పట్టికలో ఝార్ఖండ్ (31) తర్వాత, రెండో స్థానంలో నిలిచింది. తొలి రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్న ఆంధ్ర..వరుసగా ఒడిషా, తమిళనాడు, ఝార్ఖండ్, విదర్భలపై విజయాలతో క్వార్టర్స్ బెర్తును దక్కించుకుంది. గ్రూప్‌ఎలోనే ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భ.. క్వార్టర్స్ కూడా చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ నెల 6 నుంచి జరిగే క్వార్టర్స్‌లో బెంగాల్‌తో ఆంధ్ర తలపడనుంది.

**హైదరాబాద్ ఔట్....:** రంజీ ట్రోఫీలో హైదరాబాద్ పోరాటం ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌తో ఎలీట్ గ్రూప్‌డి చివరి లీగ్ మ్యాచ్‌ను ఆ జట్టు డ్రా చేసుకుంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా హైదరాబాద్‌కు 3 పాయింట్లు దక్కాయి. ఓవర్‌నైట్ స్కోరు 100/2తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గఢ్.. మ్యాచ్ ముగిసే సమయానికి 8 వికెట్లకు 411 పరుగులు సాధించింది. కెప్టెన్ అమన్‌దీప్ ఖరే (176 నాటౌట్) సెంచరీ చేశాడు. తనయ్ త్యాగరాజన్, అనికేత్ తలో మూడు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఛత్తీస్‌గఢ్ 283.. హైదరాబాద్ 631 పరుగులు చేశాయి. 7 మ్యాచ్‌ల్లో ఒక విజయం, రెండు ఓటములు, నాలుగు డ్రాలతో 16 పాయింట్లు సాధించిన హైదరాబాద్.. పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. గ్రూప్‌డి నుంచి ముంబయి (33), జమ్ముకశ్మీర్ (24) క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి.

# కొట్టేశాడు కెరీర్‌స్లామ్

**--–అల్కరాస్‌దే ఆస్ట్రేలియన్ ఓపెన్**
**–4 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన పిన్న వయస్కుడిగా రికార్డు**
**–జకోవిచ్‌కు నిరాశే**



జకోవిచ్‌కు ఆశాభంగం. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం అతడి నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. మెల్‌బోర్న్ పార్క్‌లో అల్కరాస్‌దే పైచేయి. ఫైనల్లో జకోవిచ్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలుచుకున్న ఈ ప్రపంచ నంబర్‌వన్.. అతిపిన్నవయసులో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. స్పెయిన్ వీరుడు కార్లోస్ అల్కరాస్ తన ఖాతాలో లేని ఆ ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ప్రపంచ టెన్నిస్‌పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్కరాస్ 26, 62, 63, 75తో పదిసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు. తొలి సెట్‌ను కోల్పోయాక అల్కరాస్ బలంగా పుంజుకున్నాడు. పదునైన సర్వీసులు చేసిన అతడు మ్యాచ్‌లో 9 ఏస్‌లు సంధించాడు. 36 విన్నర్లు కొట్టాడు. అల్కరాస్ అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓడడం మాజీ నంబర్‌వన్ జకోవిచ్‌కు ఇదే తొలిసారి. ఇంతకుముందు ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలిచాడు. ఈసారి ఫైనల్లో అతడు 46 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. అల్కరాస్ 27 అనవసర తప్పిదాలు మాత్రమే చేశాడు. ''ఈ ట్రోఫీ కోసం నేను ఎంత కష్టపడ్డానో ఎవరికీ తెలియదు. ఈ క్షణం కోసం ఎంతో తపించాను'' అని ఫైనల్ అనంతరం అల్కరాస్ వ్యాఖ్యానించాడు.

**అల్కరాస్ అదరహో..:** ఆటగాళ్లిద్దరూ కూడా సెమీఫైనల్స్‌లో అయిదు సెట్ల పాటు హోరాహోరీగా సాగిన సమరాల్లో గెలిచారు. మూడు గంటలకు పైగా ఆడినా వాళ్లు తమ ఫిట్‌నెస్‌ను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో ఫైనల్ ఎంతో ఆసక్తి రేపింది. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఆశించిన జకోవిచ్.. టైటిల్ పోరును ఆత్మవిశ్వాసంతో మొదలెట్టాడు. ఎలాంటి పొరపాట్లకు అవకాశమివ్వకుండా తొలి సెట్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. నాలుగో గేమ్‌లో బ్రేక్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన అతడు.. ఆ తర్వాత పట్టు సడలించలేదు. కచ్చితత్వంతో కూడిన షాట్లతో కడవరకూ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుని సెట్‌ను చేజిక్కించుకున్నాడు. ఈ సెట్లో అతడి సర్వీసు అద్భుతం. 93 శాతం పాయింట్లను తొలి సర్వీసులోనే గెలిచాడు. కానీ తొలి సెట్ చేజారాక అల్కరాస్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్ మూడో గేమ్‌లో బ్రేక్ సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అక్కడి నుంచి సర్వీసులో జకోవిచ్ తడబాటు మొదలైంది. తిరిగి ఏడో గేమ్‌లోనూ ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసిన అల్కరాస్ సెట్‌ను గెలుచుకుని స్కోరు సమం చేశాడు. అతడు మూడో సెట్లోనూ అదే జోరు కొనసాగించాడు. అయిదు, తొమ్మిదో గేముల్లో బ్రేకులతో ఆ సెట్‌ను గెలిచాడు. అయితే నాలుగో సెట్ హోరాహోరీగా సాగింది. పట్టుదలగా ఆడిన నొవాక్ రెండో గేమ్‌లో ఆరు బ్రేక్ పాయింట్లు కాచుకున్నాడు. ఇద్దరూ సర్వీసులు నిలబెట్టుకోవడంతో 44తో సమమయ్యారు. తొమ్మిదో గేమ్‌లో జకోవిచ్ ఓ బ్రేక్ పాయింట్ సంపాదించినా.. దాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఇవ్వలేదు అల్కరాస్. ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు తలపడడంతో మ్యాచ్ టైబ్రేక్‌కు వెళ్తుందేమో అనిపించింది. కానీ కీలక సమయంలో జకోవిచ్ తడబడ్డాడు. 11వ గేమ్‌లో సర్వీసు నిలబెట్టుకుని 65తో నిలిచిన అల్కరాస్.. 12వ గేమ్‌లో నొవాక్ సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

**22 ఏళ్ల వయసులో.....** తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకున్న అల్కరాస్.. కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను పూర్తి చేశాడు. పురుషుల టెన్నిస్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్నవయస్కుడిగా అతడు రికార్డు సృష్టించాడు. 88 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. ఇప్పటివరకు ఈ రికార్డు అమెరికాకు చెందిన డాన్ బడ్జ్ పేరిట ఉంది. 1938లో 22 ఏళ్ల 363 రోజుల వయసులో అతడు కెరీర్‌స్లామ్ సాధించాడు. ఇప్పుడు 22 ఏళ్ల 272 రోజుల వయసులో అల్కరాస్ ఆ రికార్డును సొంతం చేసుకున్నాడు. అతడి ఖాతాలో ప్రస్తుతం ఏడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు ఉన్నాయి. అల్కరాస్ ఇంతకుముందు రెండేసి వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్, యుఎస్ ఓపెన్ టైటిళ్లు చేజిక్కించుకున్నాడు. మొత్తం నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లూ గెలవడాన్ని 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' అంటారు. ఈ ఘనత సాధించిన తొమ్మిదో ఆటగాడు అల్కరాస్. ఈ జాబితాలో జకోవిచ్, ఫెదరర్, నాదల్ కూడా ఉన్నారు.